# సమృద్ధి


## 10.ఎ

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలచే

## ఉత్పత్తులకు విలువ జోడింపు




DGRV
apmas


Super Market
Cold Storage

# 10.ఎ

# సమృద్ధి

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలచే ఉత్పత్తులకు విలువ జోడింపు

రైతు ఉత్పత్తిదారుల సంస్థల పాలకవర్గ సభ్యుల

అవగాహన  పుస్తకముల మాలిక



# సమృద్ధి

## రైతు ఉత్పత్తిదారుల సంస్థలచే ఉత్పత్తులకు విలువ జోడింపు

**ప్రథమ ప్రచురణ :** డిశంబర్ 2020

**వెల :** రూ. 100/-

**ప్రచురణ కర్తలు :**

APMAS

మహిళా అభివృద్ధి సొసైటీ, ఆంధ్రప్రదేశ్ (ఏపిమాస్)

ఫ్లాట్ నెం.20, రావు అండ్ రాజు కాలనీ, రోడ్ నెం.2,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034, ఫోన్ : 040–23547952
ఇ–మెయిల్ : info@apmas.org వెబ్‌సైట్ : www.apmas.org

# రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యులకు స్వయముగా నేర్చుకొనే శిక్షణా కరదీపిక

**మ**న దేశంలో రైతులు ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటున్నప్పటికి ఈ దశాబ్దంలో వ్యవసాయ రంగం గణనీయమైన ఊపుందుకున్నది. రైతులను సంఘటితం చేసి, రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటు చేసుకొనుటకు ప్రోత్సహించటం అనేది రైతుల శ్రేయస్సుకు దోహదపడే విధానమని విధాన కర్తలు మరియు అమలుపరచేవారు భావిస్తున్నారు. వచ్చే ఐదు సంవత్సరముల కాలంలో ఎఫ్.పి.ఓ.లను ఏర్పాటు చేయడము ద్వారా రైతుల ఆదాయం రెట్టింపు చేయుటే మన భారత ప్రభుత్వం ప్రధాన వ్యూహంగా చేపట్టింది. మన దేశంలో ఇప్పటికే 10వేల ఎఫ్.పి.ఓ.లను వివిధ ప్రోత్సాహక సంస్థల సహకారంతో ఏర్పడినవి. 2020-24 సంవత్సరములలోపు మరొక 10 వేల ఎఫ్.పి.ఓ.లను కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ రంగ పథకం కింద ఏర్పాటు చేయుటకు, కేంద్ర ప్రభుత్వము సంకల్పించింది. ఈ విషయము మన ప్రధానమంత్రిగారు 2019 సంవత్సరంలో ప్రకటించడం జరిగినది. ఈ శిక్షణా కరదీపిక ఎఫ్‌పిఓ బోర్డు ఆఫ్ డైరెక్టర్స్ సామర్థ్యం పెంచుటకు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ విజయవంతం కావడానికి, ప్రాథమిక మరియు ముందస్తు లక్షణం, వ్యాపార సంస్థగా ఎదిగే సామర్థ్యం, సభ్యులకు వివిధ స్థాయి సేవలు అందించడం ద్వారా సభ్య రైతులు తమ వ్యవసాయ లాభములను పెంచుకొనడంలో సహకరించును. ఏపిమాస్ ద్వారా ఎఫ్.పి.ఓ. బోర్డు సభ్యులు, సిబ్బంది మరియు వాటి విస్తృత సభ్యులకు నిరంతర శిక్షణ మరియు సలహాలు ఇవ్వడం మొదటి ప్రాధాన్యత. ఏపిమాస్ తన ఎఫ్.పి.ఓ.ల ప్రోత్సాహక కేంద్రం ద్వారా పెద్ద సంఖ్యలో రైతు ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటులో నిమగ్నమై ఉన్నది. మరియు ఇతరులచే ఏర్పాటు చేయబడిన రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సరైన వ్యవసాయ విలువ గొలుసు అభివృద్ధి ప్రక్రియలో ఉండేలా సలహాలు ఇస్తున్నది.

రైతు ఉత్పత్తిదారుల సంస్థకు సంబంధించిన ప్రస్తుతం అందుబాటులో ఉన్న శిక్షణ సంపుటాలను సమీక్షించి, రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యులకు మంచి నాణ్యత గల అనుసరించదగ్గ మరియు సులభతరమైన, స్వయముగా నేర్చుకొనే పుస్తకముల మాలికలలో చాలా తేడాలు వున్నవని గ్రహించడం జరిగినది. స్వయం సహాయక సంఘాల స్వయం నియంత్రణకు సంబంధించిన అవగాహనా పుస్తకాల మాలికలను రూపొందించుటలో గడించిన అనుభవం ఆధారముగా మరియు 20 సంవత్సరముల సంస్థాగత

అభివృద్ధి శిక్షణలు, శ్రీ మధుమూర్తి మరియు శ్రీమతి రామలక్ష్మి ఆధ్వర్యములో ఏపిమాస్ బృందం ఒక సంవత్సరం పాటు రిసోర్స్ సంస్థలు, ఎన్జీఓ భాగస్వామ్యులు, శిక్షణ సంస్థలు మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులతో కలసి పని చేసి 13 సులభముగా స్వయముగా నేర్చుకొనే శిక్షణా కరదీపికలను రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యులకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆవశ్యకత, సంస్థాగత డిజైన్, సభ్యత్వం, నాయకత్వం మరియు పరిపాలన, నిర్వహణ, రిజిస్ట్రేషన్ మరియు న్యాయ పరిమితులు, వ్యాపారప్రణాళిక, ఉత్పాదకత పెంపు, మిశ్రమ మార్కెటింగ్ (ఇన్‌పుట్ & అవుట్ పుట్) వ్యవసాయ పరికరముల సేవా కేంద్రం నిర్వహణ, అకౌంటింగ్ మరియు ఆర్థిక నిర్వహణ అంశములు వుండే విధముగా రూపొందించడం జరిగినది.

రైతు ఉత్పత్తిదారుల సంస్థలు శాశ్వతమైన స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రజాస్వామ్య వ్యాపార సంస్థ. ఇక్కడ రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యులకు వారి సామర్థ్య పెంపుదల అవసరం, కాలానుగుణముగా జరిగే ఎన్నికల్లో పాలకవర్గ సభ్యుల మార్పు జరుగును. సులభముగా అర్థం చేసుకొనే స్వయముగా నేర్చుకొనే శిక్షణా కరదీపికలు పాలకవర్గ సభ్యులు తమ సభ్యులకు అనుకూలమైన సేవలందించేలా ఎదగడానికి అత్యంత ఉపయోగపడతాయని మా నమ్మకం. రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేసే వ్యవస్థాపకులు క్రమపద్దతిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పాలకవర్గ సభ్యులు స్వయముగా, ఈ అవగాహన పుస్తకముల ద్వారా నేర్చుకొనే విధముగా ప్రోత్సహించాలి. రైతు ఉత్పత్తిదారుల సంస్థల వ్యవస్థాపకులు మరియు భాగస్వామ్యులు రైతు ఉత్పత్తిదారుల పాలకవర్గ సభ్యుల అవగాహనా శిక్షణా కరదీపికలను ఉపయోగించుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థలు స్వీయ నిర్వహణ మరియు అనుకూలమైన వ్యాపార సంస్థలుగా తయారుకావడానికి సలహాలు ఇస్తూ ఉండాలి. ఏపిమాస్ శిక్షణా కరదీపికల మాలికను తెలుగు మరియు ఇంగ్లీష్‌లో రూపొందించడానికి బాధ్యత తీసుకున్నది. డిమాండ్ ఆధారముగా ఈ శిక్షణా కరదీపికలను తగిన విధముగా ఇతర భారతీయ భాషలలోకి మార్చడానికి రిసోర్స్ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వములు, జాతీయ బ్యాంకు, (నాబార్డు) మరియు గ్రామీణాభివృద్ధి మరియు శిక్షణా సంస్థలు కృషి చేయవలెను. అటువంటి ప్రయత్నమునకు ఏపిమాస్ తప్పక సహకరించును. మీ అభిప్రాయముల కొరకు ఎంతో ఆసక్తితో ఎదురుచూస్తాము.

శుభాకాంక్షలతో,

**సిఎస్ రెడ్డి, సి.ఇ.ఒ.**

ఏపిమాస్

# విషయసూచిక

ఈ పుస్తకము గురించి........................................................................09

పదకోశం ........................................................................11

పూర్వ పరీక్ష ........................................................................15

సెషన్ 1 : సంసాధన / విలువ జోడింపు అవసరం హేతుబద్ధత ........................................16

సెషన్ 2 : ప్రాధమిక సంసాధన ........................................................................24

సెషన్ 3 : విలువ జోడింపు ద్వితీయ సంసాధన ద్వారా ........................................35

సెషన్ 4 : మిల్లింగ్ – ఫాం విలువ జోడింపు ........................................................47

సెషన్ 5 : నిల్వ – సమయం విలువ జోడింపు ........................................................54

సెషన్ 6 : ఉత్పత్తి పంపిణ – స్థలం విలువ జోడింపు ........................................68

**అనుబంధం 1 :** దాల్ మిల్ సాధ్యాసాధ్యాలు ........................................................77

**అనుబంధం 2 :** దాల్ మిల్ వ్యాపార వివరములు ....................................................79

**అనుబంధం 3 :** గోదాం సాధ్యాసాధ్యాలు ........................................................85

**అనుబంధం 4 :** గోదాముకు అయ్యే వ్యయం ........................................................87

ముగింపు మదింపు ........................................................................89

# చిత్రములు

చిత్రం 1 : రైతు ఉత్పత్తిదారుల సంస్థ సేవలద్వారా విలువ జోడింపు ............................20

చిత్రం 2 : విలువ జోడింపు ప్రయోజనములు ........................................................23

చిత్రం 3 : ప్రాధమిక సంసాధన కార్యక్రమములు ........................................................26

చిత్రం 4 : ద్వితీయ సంసాధన ద్వారా విలువ జోడింపు ....................................38

చిత్రం 5 : విలువ జోడింపు రకములు ....................................40

చిత్రం 6 : గోదాము ద్వారా అవకాశములు ....................................58

చిత్రం 7 : ఉత్పత్తి పంపిణికీలక అంశములు ....................................70

చిత్రం 8 : పంపిణి మార్గాలు ....................................71

చిత్రం 9 : విలువ పొందటంలో కీలక అంశములు ....................................73

# పట్టికలు

పట్టిక 1 : గోదాము వ్యాపారములోని కీలక అంశములు ....................................62

పట్టిక 2 : గోదాము వ్యాపార ప్రణాళిక సారంశం (లక్షలలో) ....................................64

పట్టిక 3 : గోదాముకు ఒప్పందములు ....................................65

పట్టిక 4 : రవాణా వాహనం వ్యయం మరియు ఆదాయం ....................................75

పట్టిక 5 : దాల్ మిల్‌కు ముడిసరుకు లభ్యత ....................................77

పట్టిక 6 : దాల్ మిల్ సామర్థ్య వినియోగం ....................................78

పట్టిక 7 : దాల్ మిల్ ఉత్పత్తి వివరములు ....................................79

పట్టిక 8 : కందులకు ఎఫ్ఎస్ఎస్ఎఐ నాణ్యతా శ్రేణులు .................................... 81

పట్టిక 9 : దాల్ మిల్ మూలధన ఖర్చు ....................................82

పట్టిక 10 : దాల్ మిల్ నిర్వహణా ఖర్చు (రూ.లక్షలలో) ....................................83

పట్టిక 11 : దాల్ మిల్ ఆదాయ వివరములు ....................................84

పట్టిక 12 : ఫెడరేషన్ గోదాములో నిల్వ అవసరం (టన్నులలో) ....................................86

పట్టిక 13 : గోదాము నిర్వహణా వ్యయం (లక్షలలో) ....................................88

# పుస్తకము గురించి

**పాలకవర్గ సభ్యుల అవగాహన పుస్తకముల మాలిక**

1. రైతు ఉత్పత్తిదారుల సంస్థ పరిచయం & హేతుబద్ధం
2. సంస్థాగత స్వరూపం & రైతు ఉత్పత్తిదారుల సంస్థ రూపకల్పన
3. రైతు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వం
4. రైతు ఉత్పత్తిదారుల సంస్థ పరిపాలన
5. రైతు ఉత్పత్తిదారుల సంస్థ నిర్వహణ
6. రైతు ఉత్పత్తిదారుల సంస్థ న్యాయ అనుమతులు
7. వ్యాపార ప్రణాళిక
8. అకౌంటింగ్ & ఆర్ధికత
9. రైతు ఉత్పత్తిదారుల సంస్థ అవుట్ పుట్

**10.ఎ. రైతు ఉత్పత్తిదారుల సంస్థ విలువ జోడింపు**

బి. మార్కెటింగ్

ముందస్తు ఆలోచనలు

11. ఎ. ఉత్పత్తి అవసరాల సేవలు

బి. వ్యవసాయ ఉత్పత్తి పెంపు

12. ఎఫ్.పి.ఓ.లో నాయకత్వం

పాలకవర్గ సభ్యులకు అవగాహన పుస్తకాల మాలికలో భాగముగా ఈ పుస్తకము “రైతు ఉత్పత్తి దారుల సంస్థ, సభ్యుల ఉత్పత్తులకు విలువ జోడింపు” గురించి తెలియజేయును.

## అవసరం

ఈ పుస్తకము ఉద్దేశ్యం రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యులు అవసరమైన అవగాహన మరియు జ్ఞానం పొంది తమ పాత్రలను సమర్ధవంతంగా నెరవేరుస్తూ తమ సభ్యులకు ప్రయోజనం కలిగించే శక్తివంతమైన సంస్థలుగా తమ రైతు ఉత్పత్తిదారుల సంస్థను నడిపించుట.

## ఈ పుస్తకం ఎవరి కొరకు :

ఈ పుస్తకము రైతు ఉత్పత్తిదారుల సంస్థల పాలకవర్గ సభ్యుల కొరకు ఉద్దేశించబడినది. పాలకవర్గ సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలను నడిపించడంలో ఒక సంవత్సరం అనుభవం కలిగి వుండాలి.

## లక్ష్యములు

దిగువ ఈ పుస్తకము నుండి నేర్చుకొనే కీలక లక్ష్యములు ఇవ్వబడినవి.

- వ్యవసాయ ఉత్పత్తుల సంసాధన గురించి విలువ జోడింపు అవసరం మరియు ప్రాముఖ్యత తెలిసికొంటారు.

- వ్యవసాయ ఉత్పత్తుల ప్రాధమిక సంసాధన చేపట్టవలసిన వివిధ కార్యక్రమములను గుర్తించుట
- ద్వితీయ (ఆధునిక) సంసాధన ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు సాధ్యమైనంత విలువ జోడింపు గుర్తించుట
- రైతు ఉత్పత్తిదారుల సంస్థ వ్యాపార కార్యక్రమములకు ఉత్పత్తుల అవసరం మరియు ప్రయోజనం గుర్తించుట
- కొనుగోలుదారులకు / వినియోగదారులకు ఉత్పత్తుల పంపిణీ లోని వివిధ కీలక అంశములపై అవగాహన పొందుట

## ఈ పుస్తక స్వరూపం మరియు విషయాంశములు

ఈ పుస్తకం సంసాధన మరియు విలువ జోడింపు ప్రాముఖ్యత మరియు దానిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాత్రతో ప్రారంభమగును. తరువాత ప్రాధమిక సంసాధన వివరములు అంటే శుభ్రపరచుట, గ్రేడింగ్, మిల్లింగ్ లోని వివిధ మార్గాలు, నిల్వ మరియు రవాణా చేర్చబడినవి.

## ఎలా ఉపయోగించాలి

పాలకవర్గ సభ్యులు ఈ పుస్తకమును తమంత తాముగా చదువుకుని అర్ధం చేసుకోవచ్చు. లేదా విషయ నిపుణుల ద్వారా ఈ పుస్తకములోని అంశములను నేర్చుకొనవచ్చును. ఈ పుస్తకముతో బాటు సంబంధిత పత్రికలు, పోస్టర్స్ వున్నవి, వాటిని పాలకవర్గ సభ్యులు సంబంధిత ప్రదేశములలో అవగాహన కొరకు ప్రదర్శించవచ్చును.

ఈ పుస్తములోని అంశములను నేర్చుకొని, మీ రైతు ఉత్పత్తిదారుల సంస్థలో మార్కెటింగ్‌ను ప్రభావవంతముగా మరియు సమర్ధవంతంగా చేపట్టాలని కోరుకుంటున్నాము.

# పదకోశం / సంక్షిప్త నామము

**1. ఎఫ్.పి.ఒ. (రైతు ఉత్పత్తిదారుల సంస్థ):** రైతు ఉత్పత్తిదారుల సంస్థ రైతు సభ్యుల యాజమాన్యముతో సభ్యులచే నియంత్రించబడే నమోదు అయిన సంస్థ. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఉద్దేశ్యం సభ్యులకు అవసరమైన సేవలు అందిస్తూ వారి ఉమ్మడి అవసరములను తీర్చుట, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు వ్యవసాయ మరియు అనుబంధ కార్యక్రమములు నిర్వహిస్తూ ఉంటాయి. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు అధికారికమైన సంస్థలు అయినందున వాటికి కార్యాలయము / మౌలిక వసతులు, సిబ్బంది, విధివిధానములు వుండి మరియు పాలకవర్గ సభ్యులచే పరిపాలన నిర్వహించబడును.

**2. ఉప–కమిటీలు:** ఎఫ్.పి.ఓ. చేపట్టిన మార్కెటింగ్, ఆర్థిక, ఉత్పత్తి అవసరముల సరఫరా మొదలగు ప్రతీ కార్యక్రమములకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గం తమ నుంచి (2–3 సభ్యులు) సభ్యులతో ఉప కమిటీని ఏర్పాటు చేస్తుంది. ప్రతి ఉప కమిటీ తమకు కేటాయించిన విధిని మరియు పనిని పాలకవర్గ పర్యవేక్షణలో నిర్వహిస్తుంది.

**3. మహాసభ:** రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులందరూ ఆ రైతు ఉత్పత్తిదారుల సంస్థ మహాసభగా పిలువబడతారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలో మహాసభ అత్యున్నత అధికారం కలది.

**4. ఎఫ్ఎస్ఎస్ఎఐ:** భారత ఆహార భద్రత మరియు నాణ్యతా అథారిటీ(ఎఫ్ఎస్ఎస్ఎఐ) దృవీకరణ భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆహార పదార్ధముల నాణ్యత భద్రత కొరకు జారీ చేయును.

**5. సమిష్టి మార్కెటింగ్:** రైతు ఉత్పత్తిదారుల సంస్థలు తమ సభ్యుల ఉత్పత్తులను కొనుగోలు చేసి, అవసరమైన సంసాధన చేసిన తరువాత మార్కెట్‌లో విక్రయించును. దీని అర్థం ఒక సభ్యుని ఉత్పత్తికి తమ రైతుఉత్పత్తిదారుల

సంస్థయే కొనుగోలుదారు. ఇది మార్కెటింగ్ కార్యక్రమములో ఒక విధానము. ఈ విధానంలో సరుకు రైతు ఉత్పత్తిదారుల సంస్థకు ఆస్థి, కనుక మార్కెటింగ్ అనేది రైతు ఉత్పత్తిదారుల సంస్థ బాధ్యత. సమిష్టి మార్కెటింగ్ సభ్యులకు ఒక ముఖ్యమైన సేవ. దానివలన వారు తమ ఉత్పత్తిని వ్యక్తిగతముగా మార్కెటింగ్ చేయడములో ఎదురయ్యే అనేక అవరోధములను అధిగమించగలరు.

**6. విలువల గొలుసు:** వ్యవసాయములో పంటల ముడిసరుకు (ఉదా ॥ గోధుమ విత్తనం) మొదలు తుది ఉత్పత్తి వినియోగదారులు వినియోగించే రూపంలో అందించే (ఉదా॥ ఆహార పదార్థం రోటి) వరకు విలువ గొలుసుగా పిలుస్తారు. ఉత్పత్తికి ముందు, ఉత్పత్తి, నూర్పిడి, సంసాధన, మొదటి అమ్మకం (టోకు అమ్మకం), రెండవ అమ్మకం (చిల్లర వ్యాపారం) మొదలగునవి గొలుసు వలె ఒకదానితో ఒకటి ముడి పడి ఉంటాయి. గొలుసు ప్రారంభము నుండి చివరివరకు వెళ్ళే కొలది ఉత్పత్తి విలువ పెరుగుతూ ఉంటుంది. అందువలననే పంటలకు దానిని విలువ గొలుసు అంటారు. వ్యవసాయ పంటలకు సంబంధించి ఏ కార్యక్రమాన్ని చేపట్టాలన్న దాని గొలుసులో వివిధ స్థాయిలలో వివిధ కార్యక్రమములను మరియు వ్యక్తులను / సంస్థలను అర్థం చేసుకోవాలి. (ఉత్పత్తి అవసరాల సరఫరాదారు, ఆర్థికసంస్థలు,సంసాధనదారులు, పంపిణీదారులు, టోకువర్తకులు మరియు చిల్లరవర్తకులు మొ॥వారు)

**7. విలువ జోడింపు:** వస్తువుల అసలు ధరకు, అదనముగా సృష్టించబడినదే విలువ జోడింపు. వినియోగదారుల నుండి గిరాకి వలనే ఈ వ్యాపార విజయమునకు కీలకం. విలువ అనేది వినియోగదారులు చెల్లించడానికి ఇష్టపడే ధర, వారికి ఆ ఉత్పత్తి పట్ల వారికి గల గౌరవం. ఉదాహరణకు సుమారు నాణ్యత గల కందిపప్పుకు 2020 మార్చిలో సగటు మార్కెట్ ధర రూ. 51 కిలో. కాని దానిని శుభ్రపరచి, విరిగినవి మరియు చెడిపోయిన గింజలు తొలగిస్తే దానికి రూ. 61 వరకు ధర

రావచ్చు. శుభ్రపరచడానికి మరియు గ్రేడింగ్‌కు అయ్యే ఖర్చు రూ. 2/ – ఐనా నికరముగా విలువ 8 రూపాయలు ఎక్కువ వస్తుంది. రూ. 61 (ఫైనల్ ధర)– రూ. 51 (సంసాధన చేయని పప్పు వ్యయం) –రూ. 2 (విలువ జోడింపు వ్యయం)

**8. ప్రాథమిక సంసాధన:** ప్రాథమిక సంసాధన అంటే వ్యవసాయ ఉత్పత్తులను మొదటి సంసాధన అంటే శుభ్రపరచుట, గ్రేడింగ్, ఆరబెట్టుట మరియు ప్యాకింగ్. ప్రాథమిక సంసాధన చాలా రకముల వ్యవసాయ ఉత్పత్తులను మార్కెటింగ్ అయ్యేలా చేయడానికి చాలా అవసరం.

**9. ద్వితీయ సంసాధన:** ద్వితీయ సంసాధన అనగా ఆధునిక సంసాధన, దీనితో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు జరుగుతుంది. ద్వితీయ సంసాధనతో వ్యవసాయ ఉత్పత్తులకు విలువలు జోడించి వాడటానికి / తినడానికి (పప్పు,పిండి, నూనె లాగా) నిల్వకు, రవాణాకు ఎక్కువ డిమాండ్ వున్న ప్రాంతములకు చేరవేయడానికి సిద్ధముగా తయారు చేయబడతాయి.

మనం నేరుగా ధాన్యాన్ని తినము. కానీ అది మిల్లింగ్ చేసి బియ్యంగా మార్చిన తరువాత మనం వాడుకోవచ్చు. అలాగే సోయాబీన్ నేరుగా తినము. కానీ దానిని వాడటానికి వీలయ్యే నూనెగా మార్చుతారు. ఆయిల్ తీసి కేకు తీయడమే ద్వితీయ సంసాధన.

**10. ఎఫ్.పి.ఒ ఫెడరేషన్:** ప్రాథమిక / చిన్న రైతు ఉత్పత్తిదారుల సంస్థలు కలసి సభ్యులుగా ఏర్పడినది. ఎఫ్.పి.ఓ ఫెడరేషన్ రెండవ స్థాయి సంస్థ ఒకే ప్రాంతములో వున్న ప్రాథమిక ఎఫ్.పి.ఓలు కలసి ఫెడరేషన్‌గా ఏర్పడవచ్చును. ఫెడరేషన్ రిజిస్టర్డ్ అయిన అధికారిక సంస్థ. ఎఫ్.పి.ఓ. ఫెడరేషన్ పై స్థాయి కార్యక్రమములు అయిన ద్వితీయ సంసాధన, బ్రాండింగ్, మార్కెటింగ్ ఆర్థిక ఒప్పందములు మొదలగునవి చేపడుతుంది.

**11. నెగోషబుల్ గోదాము రసీదు (ఎన్ డబ్ల్యు ఆర్):**

నెగోషబుల్ గోదాము రశీదు (ఎన్ డబ్ల్యూ ఆర్) ను గోదాముల రిజిస్టర్డ్ వినియోగదారులకు వారు నిల్వ కొరకు డిపాజిట్ చేసిన సరుకులకు గాను జారీ చేసిన రశీదు. నెగోషబుల్ గోదాము రశీదు ఆర్థిక సంస్థల నుండి ఆర్థిక సహాయం పొందటానికి సాధనముగా ఉపయోగించుకొనవచ్చును. గోదాముల అభివృద్ధి నియంత్రణ అధికార సంస్థ డబ్ల్యూ డి ఆర్ ఎ (ఆహారం మరియు ప్రజా పంపిణి వినియోగదారుల మంత్రిత్వ శాఖ, ఆహారం మరియు ప్రజా పంపిణి భారత ప్రభుత్వం) క్రింద నెగోషబుల్ గోదాము రశీదు జారీ చేయబడును.

**12. గోదాము రసీదు**

ఎప్పుడు గోదాములో ఒక సరుకు నిల్వ చేస్తామో అప్పుడు గోదాము సిబ్బంది ఒక రశీదును జారీ చేస్తారు. దీనిని సాధారణముగా గోదాము రశీదు అంటారు. చాలామంది సంసాధకులు మరియు బ్యాంకులు ఈ గోదాము రశీదు ఆధారముగా అడ్వాన్సులు ఇస్తాయి. కానీ అన్ని గోదాము రశీదులు ఎన్ డబ్ల్యూ ఆర్ కాదు. ఎన్ డబ్ల్యూ ఆర్ అయినట్లయితే మన వర్తక సామర్థ్యంచాలా అధికముగా ఉండును.

**13. ఉత్పత్తి పంపిణి:**

ఉత్పత్తి పంపిణి లేదా ఉత్పత్తి సరఫరా అంటే ఉత్పత్తి అయిన వినియోగదారులకు ఉత్పత్తులను చేరవేయుట. ఉత్పత్తి పంపిణి అంటే వినియోగదారునికి అవసరమైన అన్ని ఉత్పత్తులను సకాలములో అవసరమైన స్థలములో అందించడమే.

**14. పంపిణి మార్గం:**

మధ్యవర్తుల, ఏజెన్సీస్ నెట్ వర్క్ లేదా కార్యక్రమముల ద్వారా ఉత్పత్తి స్థానము నుండి సరుకును వినియోగదారుల స్థానమునకు చేరవేయు విధానమే పంపిణీ మార్గము. టోకు వ్యాపారులు,చిల్లర వర్తకులు,పంపిణిదారులు,చిల్లర ఏజెన్సీస్, రవాణా కూడా పంపిణీ విధానముగా పరిగణించవచ్చు.

# పూర్వ పరీక్ష

**ముం**దు సెషన్‌లో తెలిపిన విధముగా, ఈ సమృద్ధి పుస్తకం రైతు ఉత్పత్తిదారుల సంస్థలచే “విలువ జోడింపు”ను గురించి తెలియజేస్తుంది.

దిగువ పుస్తకములోని అంశములపై కొన్ని ప్రాధమిక ప్రశ్నలు మీ కొరకు ఇవ్వబడినవి. ఈ ప్రశ్నలకు మనంతట మనము సమాధానం చెప్పాలి. ఈ పూర్వ పరీక్ష ఉద్దేశ్యం ఈ విషయాంశముపై మన ప్రస్తుత అవగాహనను అంచనావేసి, తద్వారా రైతు ఉత్పత్తిదారులచే సభ్యుల ఉత్పత్తులకు విలువ జోడింపు గురించి మరింత నేర్చుకుందాము.

***1. వ్యవసాయ ఉత్పత్తుల సంసాధన మరియు విలువ జోడింపు అవసరం ఏమిటి ?***

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

***2. వ్యవసాయ ఉత్పత్తులకు సంసాధన మరియు విలువ జోడింపుకు గల వివిధ మార్గములు ఏమిటి ?***

..........................................................................................................................

..........................................................................................................................

..........................................................................................................................

**3. రైతు ఉత్పత్తిదారుల సంస్థచే సంసాధన మరియు విలువ జోడింపుకు అవసరమయ్యే వివిధ సదుపాయములు ఏమిటి ?**

..........................................................................................................................

..........................................................................................................................


..........................................................................................................................

..........................................................................................................................

1

# సంసాధన మరియు విలువ జోడింపు అవసరము మరియు వివరణ

## ఉద్దేశ్యములు



వ్యవసాయ ఉత్పత్తుల సంసాధన మరియు విలువ జోడింపు అవసరం మరియు ప్రాముఖ్యత తెలిసికొనుట

వ్యవసాయ ఉత్పత్తుల గొలుసులో రైతు ఉత్పత్తిదారుల సంస్థ క్రియాశీలంగా ఉండవలసిన ప్రాముఖ్యతను గుర్తించుట

**విషయాంశములు :**

**1.** వ్యవసాయ ఉత్పత్తుల సంసాధన వలన ప్రయోజనములు


2. వ్యవసాయ ఉత్పత్తులకు విలువల జోడింపు అవసరం.

3. సంసాధన మరియు విలువల జోడింపులో ఎఫ్.పి.ఓ.ల పాత్ర

**వివరములు :**

విపణి పుస్తకములో మార్కెటింగ్ లోని వివిధ అంశములు గురించి మనము గుర్తు చేసుకుందామా. మార్కెటింగ్ చక్రం కొనసాగింపులో భాగముగా, ఈ పుస్తకం (సమృద్ధి) విలువ జోడింపు మరియు ఉత్పత్తి సరఫరా గురించి తెలియజేయును. ఉత్పత్తులకు విలువ జోడింపుకి సంసాధన (ప్రాసెసింగు) ఒక మార్గము. సంసాధన ప్రాధమిక / మౌలికము అయి ఉండవచ్చును, అంటే చిన్న కార్యక్రమములు శుభ్రపరచుట,

గ్రేడింగ్, ప్యాకింగ్ మొదలగునవి. ఆధునిక / ద్వితీయ సంసాధనలో వ్యవసాయ సరుకులను (కందులు, వేరుసెనగ, గోధుములు మొదలగునవి) వాటిని వండటానికి వీలుగా చేయుట. ఉదా. పప్పు, ఆయిల్, పిండి మొదలగునవి. ఎక్కువ విలువ రావడానికి అలాగే నిల్వ మరియు రవాణా చేయుట అవసరం. ఈ పుస్తకములో ఒక అతి ముఖ్యమైన అంశమైన మార్కెటింగులో ఉత్పత్తుల పంపిణి గురించి తెలుసుకుందాము. ఇది వినియోగదారులకు / కొనుగోలుదారులకు ఉత్పత్తుల సరఫరా, అవసరమైన రవాణా మరియు లాజిస్టిక్ సదుపాయము అయి ఉండును. ఈ వివరములతో మనము విలువ జోడింపు మరియు ఉత్పత్తి సరఫరా నిర్వహణలోకి వెడదామా? ప్రారంభములో వ్యవసాయ సరుకులకు విలువ జోడింపు అవసరం మరియు సౌకర్యముల ఏర్పాటు మొదలైనవి గురించి చూద్దాము.




## 1.1. సంసాధన మరియు విలువ జోడింపు అవసరం

మన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రాధమిక లక్ష్యమును మనం గుర్తు చేసుకుంటే అవసరమైన మార్కెటింగ్ వంటి సేవలను అందించి, రైతు సభ్యుల ఆదాయ స్థాయిని పెంచుట. క్రింద వివరించిన విధముగా సంసాధన మరియు విలువ జోడింపు కార్యక్రమములు మార్కెటింగుకు ముఖ్యమైనవి.

**ఉత్పత్తి విలువలో పెరుగుదల**

సంసాధన వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచును. దీనికి కందుల ఉదాహరణ తీసుకుందాము. అది ఎలాగో చూద్దాము. మార్కెట్లో రైతులకు కందుల అమ్మకం ధర – క్వింటాలుకు రూ.5,100/– శుభ్రపరచిన మరియు గ్రేడింగ్ చేసిన కందుల ధర క్వింటాలుకు రూ. 6,100/–.

కందులు శుభ్రపరచుటకు మరియు గ్రేడింగ్ వ్యయం రూ.400/–

నికర విలువ జోడింపు – క్వింటాలుకు రూ.600/– (రూ..6,100 – రూ.5100 – రూ.400)


రైతు ఉత్పత్తిదారుల సంస్థ సంసాధన చేపట్టినట్లయితే తన సభ్యులకు మరింత విలువను(రూ.5,700) అందజేస్తుందని దీనివలన తెలుస్తున్నది.

**ముడి సరుకు ధరలు మరియు సంసాధన చేసిన ఉత్పత్తి ధరల మధ్య తేడా**

మన అందరికి తెలిసినదే ముడి సరకుల ధరలు (రైతు స్థాయిలో) అంతగా పెరగవు. అయితే సంసాధన చేసిన ఉత్పత్తుల ధరలు (వినియోగదారుల స్థాయిలో) పెరుగుతూనే ఉంటాయి, చాలా అరుదుగా తగ్గుతాయి. క్రింది వివరములు దీనిని బలపరుస్తున్నాయి.

| పంటలు | 2015–16 | 2016–17 | 2017–18 | 2018–19 | 2019–20 |
|---|---|---|---|---|---|
| కందులు (మొత్తం) | 3,910 | 4,080 | 4,335 | 4,250 | 4,420 |
| కందిపప్పు | 12,607 | 15,147 | 11,345 | 11,634 | 12,700 |

**ముడికందులు మరియు తుది ఉత్పత్తి ధరల పోలిక**



**చర్చకు ప్రశ్న:** పైన చూపిన వివరముల ఆధారముగా, మన రైతు ఉత్పత్తిదారుల సంస్థకు మనము ఇచ్చే సలహా ఏమిటి?

.......................................................................................................................................

.......................................................................................................................................

## రైతు ఉత్పత్తిని కొద్దిపాటి మార్పులతో వ్యాపారం చేసే అవకాశము

కొద్దిపాటి మార్పులతో రైతు ఉత్పత్తులను వ్యాపారం చేసే రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు ప్రస్తుతము మరియు భవిష్యత్తులో అవకాశములు వున్నాయి. ఉదాహరణకు టమాటా గుజ్జు, ఎండిన మామిడి, ఒలిచిన వేరుశనగ, టమాట కెచప్, మామిడి పల్ప్, శుభ్రపరచిన వేరుశనగ నూనె తయారి సంసాధన పరిశ్రమలకు సరఫరా చేయవచ్చు.

## పంట నూర్పిడి నష్టములు తగ్గింపు

మనదేశంలో వ్యవసాయ ఉత్పత్తిల నూర్పిడిలో చాలా నష్టములు ఉంటాయి. సాధారణముగా తెలిసిన విషయం అది రూ. 92,651 కోట్లుగా అంచనా (2016)అది చాలా పెద్ద నష్టము. దిగువ వివిధ పంటలకు జరిగిన నష్టము అంచనా ఇవ్వబడినది.

| తరగతి | పంట నూర్పిడిలో కోత నష్టముల శాతము (2016) |
|---|---|
| పండ్లు కూరగాయలు | 4.58 – 15.88 |
| పప్పు ధాన్యాలు | 6.36 – 8.41 |
| ధాన్యాలు | 4.65 – 5.99 |
| నూనెగింజలు | 3.08 – 9.96 |


సంసాధన మరియు విలువ జోడింపు పంటనూర్పిడి నష్టములను తగ్గించే అతిసమర్ధవంతమైన మార్గము మరియు ఆహారము భద్రత మరియు పోషక రక్షణను కలుగజేస్తాయి. వేరు వేరు విలువ జోడింపు కార్యక్రమములు చేపట్టి నూర్పిడి నష్టములను తగ్గించును.

- సరైన పంట సాగు మరియు నూర్పిడి పద్ధతులు

- సాగు తర్వాత సరియైన నిర్వహణ
- సరైన నిల్వ నిర్వహణ విధానం
- సమర్థమైన ఉత్పత్తి సరఫరా గొలుసు అభివృద్ధి

## 1.2 విలువ జోడింపులో రైతు భాగం

సాధారణముగా రైతు ఉత్పత్తిపై ఆదాయము చాలా తక్కువ. ఈ ఆదాయము రైతు పెట్టిన పెట్టుబడికి, సమయానికి, కూలీల ఖర్చులతో పోల్చితే చాలా తక్కువ. రైతు ఉత్పత్తిదారుల సంస్థ సేవల వలన రైతుకు ఆదాయము గణనీయముగా పెరుగును. ఇది దిగువ ఇచ్చిన కందుల ఉదాహరణతో తెలుసుకుందాము.




*చిత్రం 1 : రైతు ఉత్పత్తిదారుల సంస్థ సేవల ద్వారా విలువ జోడింపు*

**అభ్యాసం :** పై చిత్రం నుండి మనము అర్థం చేసుకున్నవి ఏమిటి?

....................................................................................................................................

....................................................................................................................................

పై చిత్రములో రెండు పరిస్థితులు చూశాము. ఒకటి ఎఫ్.పి.ఒ లేకుండా, మరొకటి ఎఫ్.పి.ఒ ఏర్పడిన తరువాత రెండు పరిస్థితులలో కందుల ధర వినియోగదారుని స్థాయిలో సమానము. ఎఫ్.పి.ఒ. లేని చోట వినియోగదారుని విలువలో రూ.40/– మాత్రమే పొందుతున్నారు. వినియోగదారుని విలువలోని మిగిలిన భాగం మధ్యవర్తులు పొందుతున్నారు.

అయితే ఎఫ్.పి.ఒ కమిషన్ ఏజెంట్ మరియు మిల్లర్ విధులను చేపట్టవచ్చును. ఈ మధ్యవర్తి భాగం రూ.27(రూ.10+17) కూడా ఎఫ్పిఓ కు వచ్చును. ఎఫ్.పి.ఒ దానిలోని కొంత భాగం (ఉదాహరణకు రూ.13 (మహాసభ నిర్ణయం ప్రకారం) సభ్యునికి వారు ఎఫ్.పి.ఒ కు అందించిన ఉత్పత్తి ఆధారముగా చెల్లించవచ్చును. దానితో సభ్యుని భాగం రూ.40 నుంచి రూ.53కు పెరుగును. మనం వినిమయ పుస్తకం ఎఫ్.పి.ఒ లలో సభ్యత్వం హక్కులు, బాధ్యతలు గుర్తు చేసుకోవచ్చు. సభ్యులు ఎవరైతే రైతు ఉత్పత్తిదారుల సంస్థ సేవలు ఉపయోగించుకుంటారో వారికి మాత్రమే లాభం లభించును. ఇదేకాక రైతు ఉత్పత్తిదారుల సంస్థ తన సభ్యులకు అవి ఉత్పాదకత పెంపు, వ్యవసాయ యంత్రములు. నాణ్యమైన ఉత్పత్తి అవసరములు మరియు మార్కెట్ కు అందుబాటు వంటి వేరు వేరు సేవలు అందిస్తుంది.

కనుక పై ఉదాహరణ ద్వారా రైతు ఉత్పత్తిదారులసంస్థ ద్వారా సంసాధన మరియు విలువ జోడింపు ఉత్పత్తుల విలువలో రైతుల భాగం పెంచడానికి ఒక ముఖ్యమైన మార్గం అని మనం అర్థం చేసుకోవచ్చు.

**విలువ గొలుసులో రైతు ఉత్పత్తిదారుల సంస్థల చురుకైన పాత్రధారి**

రైతు ఉత్పత్తిదారుల సంస్థ చురుకైన పాత్రధారిగా వుండాలా లేదా దానినుండి కేవలం ప్రయోజనములను పొందే సంస్థగా వుండాలా? అనే ఒక ప్రధాన ప్రశ్న మనము వేసుకోవాలి. ఇంతకుముందు తెలుసుకున్న కందుల ఉదాహరణలో తెలియజేసిన ప్రకారం, ఉత్పత్తి విలువలో అవసరమయ్యే భాగమును సుస్థిరముగా పొందటానికి మరియు వ్యవసాయ విధానముపై నియంత్రణ కలిగి ఉండటానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థ విలువల గొలుసులో ప్రధాన సూత్రదారిగా ఉండవలెను. ముఖ్యంగా ఉమ్మడి ప్రయోజనములను పొందటానికి ఇది చాల అవసరం. ఇది ప్రస్తుత పరిస్థితిలో విరుద్ధముగా ఉన్నది. ఇతరులు వ్యవసాయ విలువ గొలుసు కార్యక్రమములలో చురుకుగా పాల్గొనుచుండగా, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సేకరణ మరియు విలువలో అసమానమైన తక్కువ భాగమును పొందుతున్నది.

***మన ఉత్పత్తుల విలువ గొలుసులో మన రైతు ఉత్పత్తిదారుల సంస్థ చురుకైన పాత్ర పోషించడానికి గల మూడు మార్గములు ఏమిటి?***

1. ..........................................................................................................

2. ..........................................................................................................

3. ..........................................................................................................

ఏ వ్యవసాయ ఉత్పత్తి విలువ అయినా  కేవలం ఉత్పత్తి మరియు సేకరణ వలన కాదు. పంట సాగు తరువాతే ఉంటుంది. కనుక రైతు ఉత్పత్తిదారుల సంస్థ విలువ గొలుసులో పాల్గొని రైతులకు ఎక్కువ ప్రయోజనములు లభించేలా చేయాలి.

## 1.3. విలువ జోడింపు ప్రయోజనములు

ఇంతకుముందు ఉదాహరణలలో రైతు ఉత్పత్తిదారుల సంస్థచే వేరువేరు విలువ జోడింపు కార్యక్రమములను (శుభ్రపరచుట మరియు గ్రేడింగ్) చూసాము. దీనితో రైతుల లాభదాయకత పెరుగును. అంతేకాక రైతు ఉత్పత్తిదారుల సంస్థ వేరువేరు విలువ జోడింపు కార్యక్రమములు చేపట్టడము వలన స్థానికముగా ఎంతోమందికి ఉపాధి లభిస్తుంది. ఎందుకంటే వేరువేరు పనులు చేసేవారు (సాధారణ పనులు చేసేవారు మరియు నైపుణ్యం కలవారు) అవసరము.

తాజాగా పెరిగిన ఆరోగ్య స్పృహ మరియు అవగాహన వలన నాణ్యత మరియు సురక్షితమైన ఆహార ఉత్పత్తుల కొనుగోలు పెరుగుతున్నది. ఉదాహరణకు పురుగుమందులు లేని కూరగాయలు, సేంద్రియ ఉత్పత్తులు. కొవ్వు లేని ఉత్పత్తులు మొదలగునవి. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత మరియు సురక్షతను సంసాధనతో పెంచుకొని ఈ అవకాశమును సమర్ధవంతముగా ఉపయోగించుకోవచ్చు. సంసాధన చేసిన మరియు సురక్షితమైన ఉత్పత్తులకు మంచి ఎగుమతి అవకాశములు వున్నవి.

**అభ్యాసం :** ఇపుడు మన వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు వలన కలిగే వివిధ ప్రయోజనములను క్రింద వ్రాద్దాము.


..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

..........................................................................................................

విలువ జోడింపులో కలిగే ప్రయోజనముల సారాంశంను దిగువ చిత్రములో చూపబడినది.




*చిత్రం: 2 విలువ జోడింపు ప్రయోజనములు*

పైన తెలిపిన విధముగా విలువ జోడింపు వలన రైతులకు అనేక ప్రయోజనములు కలవు. అవి రైతులకు మరింత లాభదాయకత, ఉపాధి కల్పన, మార్కెట్ అవకాశములను వినియోగించుకొనుట, పంట సాగు నష్టములను తగ్గించుకొనుట మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు పోటీతత్వం కలిగించును.


విలువ జోడింపు అవసరమును అర్ధము చేసుకొని దానిపై మనకు గట్టి నమ్మకము కలిగింది కనుక, సంసాధన మరియు విలువ జోడింపు వివరములను తరువాతి అధ్యాయములో తెలుసుకుందాము.

పాలకవర్గ సభ్యులుగా మనం వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు అవసరమును అర్ధం చేసుకుని, తద్వారా ఉత్పత్తుల విలువలో రైతు భాగం పెంచుటకు, విలువల గొలుసులో మన రైతు ఉత్పత్తిదారుల సంస్థను చురుకైన పాత్ర పోషించే విధంగా తయారుచేయవచ్చు.

2

# ప్రాధమిక సంసాధన

## ఉద్దేశ్యములు




వ్యవసాయ ఉత్పత్తుల ప్రాధమిక సంసాధనలో వివిధ కార్యక్రమములను గుర్తించుట


ప్రాధమిక సంసాధక కేంద్రముల గురించి తెలిసికొనుట మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థల కొరకు ఏర్పాటు విధానము

**విషయాంశములు :**

1. ప్రాధమిక సంసాధనలో వివిధ కార్యక్రమములు – శుభ్రపరచుట, ఆరబెట్టుట, గ్రేడింగ్, ప్యాకింగ్
2. ప్రాధమిక సంసాధన కేంద్రం




సంసాధన మరియు విలువ జోడింపు అవసరం మరియు ప్రాముఖ్యత గురించి తెలుసుకున్న తరువాత, మనం ప్రాథమిక సంసాధన చేపట్టుటకు సిద్ధమైనట్లేనా? మనందరికీ తెలిసినట్లే ప్రాథమిక సంసాధన ముఖ్యమైన కార్యక్రమములైన శుభ్రపరచుట, ఆరబెట్టుట, గ్రేడింగ్ మరియు వ్యవసాయ ఉత్పత్తి ప్యాకింగ్ చేసి మార్కెటింగ్‌కి సిద్ధముగా ఉంచుట. ఏ వ్యవసాయ ఉత్పత్తికి అయిన ప్రాథమిక సంసాధన అవసరం.




## 2.1. పాధమిక సంసాధన కీలక అంశములు మరియు ప్రయోజనములు

ప్రాధమిక సంసాధనలోని వివిధ అంశములు దిగువ చిత్రములో చూపబడినవి.



**శుభ్రపరచుట**
రాళ్ళు / మట్టిగడ్డలు ఇతర మొక్కల విత్తనములు మరియు ఇతర పదార్ధములు, కలుపు మొక్కలు లేకుండా కడగటము



**ఆరబెట్టుట**
నిర్దేశించిన పరిమితిలో తేమ ఉండేటట్లు ఆరబెట్టటము



**గ్రేడింగ్ వేరు చేయుట**
ప్రతి ఉత్పత్తిని నాణ్యతా గ్రేడ్స్ ప్రకారము వేరుచేయటము



**ప్యాకింగ్**
ఉత్పత్తుల వారీగా సంచులలోకి ఎత్తి ప్యాకింగు చేయటము

*చిత్రం 2 : ప్రాధమిక సంసాధన కార్యక్రమములు*

పైన చూపిన ప్రకారం వ్యవసాయ వస్తువుల సంసాధనకు వివిధ కార్యక్రమములు చేపట్టవలసి ఉంటుంది. ఉదాహరణకు మొక్కజొన్న విషయములో, అదీ గ్రేడింగ్ చేయనట్లయితే రూ. 1200 క్వింటాలు చొప్పున మొత్తం పంటకు చెల్లించబడును. అయితే గ్రేడింగ్ చేసి, చాలా మటుకు పంటకు ఎ గ్రేడ్ గా ప్రభుత్వ కనీస మద్దతు ధర క్రింద రూ. 1760 క్వింటాల్ చెల్లిస్తుంది. తక్కువ గ్రేడ్ మొక్క జొన్న కోళ్ళ యూనిట్స్‌కు అమ్మబడును. ఇది సంసాధన ఖర్చు క్వింటాల్‌కు రూ. 100/– మినహాయించిన తరువాత కూడా లాభదాయకతను పెంచును.

మరొక ఉదాహరణ: జనవరి 2020 లో వేరుసెనగ కర్నూల్ మార్కెట్ లో క్వింటాల్ కు రూ. 4400 నుండి 5450 చెల్లించడం జరిగినది. ఇది సగటున క్వింటాల్‌కు రూ. 5000. ఒక క్వింటాల్ వేరుసెనగ 70 కేజీల కాయలను ఇచ్చును. అదే నెలలో కర్నూలు మండీలో 70 కేజీల కాయల ధర రూ. 5000లు. కానీ అదే నెలలో కర్నూల్ మండిలో వేరుసెనగ కాయలు. క్వింటాల్ రూ. 7100–8100 కు అమ్మబడినది. దీనికి అదనముగా కాయలను ఒలిచి, శుభ్రపరచిన అదే మార్కెట్లో ధరలు రూ. 12500 నుంచి రూ. 15000 మధ్య క్వింటాలు లభించును. సాధారణ వేరుశనగను హెచ్‌పిఎస్ (నాణ్యమైన గింజలను చేతితో ఏరుట) నాణ్యతకు మార్చడానికి కఠినమైన పద్ధతిలో శుభ్రపరచుట మరియు గ్రేడింగ్ కలిగిన ప్రాధమిక సంసాధన అవసరం.

**అభ్యాసం:** మనరైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రాంతములో గల మూడు ముఖ్యమైన వ్యవసాయ ఉత్పత్తుల జాబితా చేద్దాము. ప్రతీ ఉత్పత్తికి అవసరమయ్యే ప్రాధమిక సంసాధన కార్యక్రమములను మరియు విలువ జోడింపు కార్యక్రమముల జాబితా తయారు చేద్దాము.

| క్రమ సంఖ్య | ఉత్పత్తి | ధర (సంసాధనకు ముందు) | అవసరమయ్యే ప్రాధమిక సంసాధన | సంసాధన వ్యయం | ధర (సంసాధన తరువాత) |
|---|---|---|---|---|---|
| 1. | | | | | |
| 2. | | | | | |
| 3. | | | | | |

## 2.2. క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థలో ప్రాధమిక సంసాధన

**ఉదాహరణ**

**క్రిషీ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (క్రిషీ ఎఫ్.పి.సి)**

**వివరణ**

క్రిషీ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ (క్రిషీ ఎఫ్పిసి) 3 సంవత్సరముల క్రితం సిరిపూర్ నందు ప్రారంభించబడినది. తాలూకాలో ప్రధాన స్థానములో వున్నది. సిరిపూర్ ఒకవైపు మంచి రహదారితో 40కిమీ దూరంలో వున్న జిల్లా ప్రధాన నగరమైన విజయపూర్‌తో కలుపబడివున్నది. మరోవైపు రాజాపేటతో కలుపబడి వున్నది. ఇది పెద్ద వర్తక మరియు వ్యాపార పట్టణం. ఒక మెట్రో నగరం సిరిపూర్‌కు 190 కిలోమీటర్ల దూరములో వున్నది. ఇది జిల్లా ప్రధాన నగరం నుండి జాతీయ రహదారితో కలుపబడి వున్నది.

**వ్యవసాయ పరిస్థితులు**

ఈ ప్రాంతం దేశంలోని ఇతర గ్రామీణ ప్రాంతాల వలె చాలామటుకు వ్యవసాయంపై కొంతమంది, ఉద్యోగంపై ఆధారపడి వున్నారు. 2/3 వంతు భూమి వర్షాధారం, కొంత ప్రాంతం మరియు చెరువులు మరియు బోర్‌వెల్స్‌తో నీటి పారకం కలిగి వున్నాయి. చాలామంది రైతులు ప్రభుత్వ శాఖల సహకారముతో డ్రిప్ / స్ప్రింక్లర్ల పద్ధతిలో నీటి పారకం ఏర్పాటు చేసుకున్నారు. సాంప్రదాయకముగా వేరుశనగ (ఎక్కువ శాతం ఖరిఫ్ లో మరియు కొంత శాతము నీటిపారుదల వున్న చోట రబీలో సాగు చేయబడును) మరియు కందులు ఖరీఫ్‌లో ఈ ప్రాంతములో సాగు చేసే ప్రధాన పంటలు. రైతు ఉత్పత్తిదారుల ప్రాంతం కూరగాయలకు పేరుగాంచినది. (చాలావరకు బెండ, మిరప, వంకాయ మరియు పొట్లకాయ మరియు కొన్ని ఇతర కూరగాయలు బీన్స్, టమాట మొదలగునవి పండుతాయి. ఈ ప్రాంత రైతులు చిరుధాన్యాలైన రాగులు మరియు కొర్రలను సాగు చేయుచున్నారు.

**సభ్యత్వం మరియు పరిపాలన**

రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో 900 మంది చిన్న మరియు మధ్యతరగతికి చెందిన వాటాదారులు వున్నారు. ఈ సభ్యులు 16 పక్క పక్కన వున్న గ్రామాలకు చెందినవారు. రైతు ఉత్పత్తిదారుల కంపెనీ 12 మంది అంకిత భావం, వ్యవస్థాపక లక్షణములు గల డైరెక్టర్స్ ఎన్నిక కాబడినారు. అందులో 5గురు మహిళలు, ఈ 12 మంది రెగ్యులర్ డైరెక్టర్స్ కాగా అదనముగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో ముగ్గురు స్వతంత్ర డైరెక్టర్స్ కూడా బోర్డులో వున్నారు.

శ్రీమతి లక్ష్మి వ్యవసాయ రుణాలను చూసే సీనియర్ బ్యాంకు మేనేజర్, శ్రీ సీతారామ్, వ్యవసాయ శాఖ అధికారి, ఇతనికి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగు, ఇన్‌పుట్స్ సరఫరాలో అపారమైన అనుభవం వున్నది. శ్రీ స్వామినాథ్, వ్యవసాయ శాఖలో పని చేసి పదవీ విరమణ చేసిన వ్యక్తి. వ్యవసాయ సాగులో విస్తృతమైన అనుభవం మరియు ఉత్పత్తి సాంకేతిక విషయములలో నిపుణుడు.

పాలకవర్గమునకు శ్రీ రామయ్య అధ్యక్షుడు, రామయ్య ఆ ప్రాంతములో విశేష వ్యవసాయ అనుభవం మరియు రైతుల సంక్షేమం పట్ల సానుభూతి కలవాడు. అంతేకాక ఆ ప్రాంతములో అనేక సమస్యలను/ వివాదములను పరిష్కరించినవాడిగా గుర్తింపు కలవాడు.

**నిర్వహణ**

రైతు ఉత్పత్తిదారుల కంపెనీ పాలకవర్గం శ్రీ గణేష్‌ను మేనేజర్‌గా, శ్రీమతి దుర్గను అకౌంటెంట్‌గా నియమించినారు. గణేష్ ప్రధానముగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ వ్యాపార వ్యవహారములను నిర్వహించును. దుర్గ లెక్కలు మరియు పుస్తక నిర్వహణ, పరిపాలన మరియు న్యాయపరమైన అంశములు నిర్వహించును. ఇద్దరు గత రెండు సంవత్సరములుగా రైతు ఉత్పత్తిదారుల కంపెనీలో చురుకుగా పని చేయుచున్నారు.

సిరిపూర్‌లో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయం మరియు రైతుల సేవా కేంద్రం కలిగి వున్నది. ఈ భవనములో ఒక కార్యాలయ గది మరియు రైతు సేవా కేంద్రమునకు స్థలం మరియు చిన్న సమావేశ మందిరం కలవు. దీనిలో నెలవారీ పాలకవర్గ సమావేశం మరియు సమీక్షా సమావేశములు జరుపుతారు. ఇక్కడ సరుకు నిల్వ సదుపాయం కలదు. దీనిలో పంట ఉత్పత్తుల అవసరములు (విత్తనములు, ఎరువులు మరియు పురుగు మందులు) మరియు వ్యవసాయ పనిముట్లు ఉంచబడును. రైతు ఉత్పత్తిదారుల కంపెనీ కార్యాలయములో తగిన ఫర్నిచర్, కంప్యూటర్, ఇంటర్నెట్ మరియు టెలిఫోన్ సౌకర్యం కలిగి వున్నది.

రైతు ఉత్పత్తిదారుల కంపెనీ అవసరమైన సంస్థాగత లైసెన్సెస్ అంటే పాన్, జిఎస్టి రిజిస్ట్రేషన్ మరియు ఉత్పత్తి అవసరముల వ్యాపారం లైసెన్స్ (విత్తనం,ఎరువులు మరియు పురుగు మందులు) మార్కెట్ మరియు దుకాణముల స్థాపన లైసెన్సులు కలిగి వున్నది.

**వ్యాపార కార్యక్రమములు**

ప్రస్తుతం రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఉత్పత్తి అవసరముల సరఫరా మరియు సభ్యుల కొరకు మార్కెటింగ్ కార్యక్రమములను నిర్వహిస్తున్నది. అంతేకాక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ గత రెండు

సంవత్సరముల నుండి 10 లక్షల నిర్వహణ మూలధనమును ఋణముగా పొందినది.

ఎఫ్.పి.ఓ. సభ్యుల కొరకు, సాముహికంగా అవసరమైన ఉత్పత్తి అవసరములను కొనుగోలు చేయుచున్నారు. అంతేకాక రైతు ఉత్పత్తిదారుల కంపెనీ టార్పాలిన్, పవర్ వీడర్స్, స్ప్రేయర్‌లు మొదలైన పరికరములు సభ్యుల కొరకు అమ్మకాలు జరుపుతున్నది. రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సభ్యుల వ్యవసాయ ఉత్పత్తికి సాముహిక మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తున్నది.

ప్రస్తుతం ఈ కార్యక్రమములు అన్ని చిన్న స్థాయిలో నిర్వహిస్తున్నప్పటికీ, వచ్చే సీజన్ నుండి సభ్యులకు అవసరమైన అన్ని సేవలను చేపట్టాలని పాలకవర్గం భావిస్తున్నది.

### ఫెడరేషన్‌లో సభ్యత్వం

రైతు ఉత్పత్తిదారుల కంపెనీ జైకిసాన్ ఎఫ్.పి.ఓ. ఫెడరేషన్‌లో రూ.50,000/- వాటాధనం చెల్లించి సభ్యత్వం పొందినది. జైకిసాన్ ఎఫ్.పి.ఓ. క్లస్టర్ స్థాయి ఫెడరేషన్ ఒక సంవత్సరం క్రితం ఏర్పాటు చేయబడినది.ఇది రాజాపేట లో వున్నది.నిజానికి క్రిషి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఈ ఫెడరేషన్ వ్యవస్థాపక ఏజెన్సీలో ఒకటి. జైకిసాన్ ఫెడరేషన్‌లో ధరణి, వసుంధర, పృధ్వి మరియు సస్య రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు కూడా సభ్యత్వము కలిగి వున్నది.

### రైతు స్థాయిలో..

చాలామటుకు ప్రాథమిక సంసాధన కార్యక్రమములు, ముఖ్యముగా శుభ్రపరచుట మరియు ఆరబెట్టుట రైతు స్థాయిలోనే జరుగుతాయి. రైతు ఉత్పత్తిదారుల పాలకవర్గం తమ నుండి మార్కెటింగు ఉప కమిటీ ఏర్పాటు చేసుకుని పర్యవేక్షించటం జరుగుతుంది. రైతు నాణ్యమైన ఉత్పత్తిని ఉత్పత్తిదారుల సంస్థకు తీసుకొని రావలసిన అవసరం గురించి ప్రతి గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ డైరెక్టర్ ద్వారా నిరంతరముగా సభ్యులకు విద్యా కార్యక్రమములు నిర్వహిస్తారు. క్రిషీ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఈ కార్యక్రమములను సభ్యుల స్థాయిలో అవసరమైన సామాగ్రి టార్పాలిన్, ప్యాకింగ్ సామాగ్రి మరియు యంత్రములు సరైన పంట కోత మరియు నూర్పిడి, ఎండుట కొరకు తన రైతు సేవ కేంద్రము నుండి అందించును.

### రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో..

శుభ్రపరచుట మరియు ఆరబెట్టుట లాంటి కార్యక్రమములు రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో జరగరాదు. ఎందుకంటే రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో పరిమాణం అధికముగా వుండటము వలన వ్యయం కూడా అధికము అవుతుంది. రైతు నుండి ఉత్పత్తులను సేకరణ చేసే సమయంలో పంట వారి

నాణ్యతా ఆధారిత గ్రేడ్స్ ఆధారంగా ఎఫ్‌పిఓ జరపాలి. కొన్ని సందర్భములలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రత్యేకమైన పద్ధతిలో రీ ప్యాక్ చేయవలసి వుంటుంది (టమాటాలకు క్రేట్స్, విత్తనములకు కృత్రిమమైన జ్యూట్ సంచులు, ధాన్యం కొరకు గోనె సంచులలో వుంచవలెను). లేబులింగులు, నిల్వ మరియు రవాణా ఏర్పాటు చేయాలి. మార్కెటింగ్ ఉప కమిటీ, సేకరణ కేంద్రం వద్ద గ్రేడింగ్ మరియు ఉత్పత్తి ప్యాక్ చేయుట కొరకు నలుగురు పనివారిని ఏర్పాటు చేసుకోవాలి.

రైతు ఉత్పత్తిదారుల ఉప కమిటి ముఖ్యమైన బాధ్యత అవసరమైన గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ కార్యక్రమాలను, రైతు ఉత్పత్తిదారులసంస్థ స్థాయిలో ఏర్పాటుచేయుట అని పైఉదాహరణ నుండి తెలిసి కోవచ్చును. ఉప కమిటి సభ్యులకు అవసరమైన విద్యా కార్యక్రమమును నిర్వహించి సభ్యులు తమస్థాయిలో ఉత్పత్తిని శుభ్రపరచి మరియు ఆరబెట్టి నాణ్యమైన ఉత్పత్తిని సేకరణ కేంద్రానికి తీసుకొని రావలెను.

## ప్రాథమిక సంసాధన కేంద్రము

క్రిషీ రైతు ఉత్పత్తిదారుల సంస్థ పరిధిలోని ప్రాంతం మరియు పరిసర ప్రాంతములో కూరగాయల సాగు ఎక్కువ. రైతు ఉత్పత్తిదారుల సంస్థ కూరగాయల సమిష్టి మార్కెటింగ్ చేపట్టి కార్పొరేట్ చిల్లర కొనుగోలుదారులకు సరఫరా చేస్తున్నది. ఈ చిల్లర కొనుగోలుదారులకు సరఫరా చేసే విధానము విపణి మార్కెటింగ్ మాడ్యుల్‌లో ఇవ్వడం జరిగినది. స్థానిక స్థాయిలో సేకరణ సదుపాయములు లేనందున, రైతు ఉత్పత్తిదారుల సంస్థ కూరగాయల సేకరణను ఎక్కువమంది సభ్యులకు వర్తింప చేయలేక, కొనుగోలుదారుల డిమాండ్‌ను కూడా చేరుకోలేక పోయినది. దీనిని దృష్టిలో పెట్టుకొని క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థ పాలకవర్గ సభ్యులు మేనేజర్ గణేష్‌ను జిల్లా ప్రధాన కేంద్రము అయిన విజయనగర్ వెళ్లి ప్రాథమిక సంసాధన కేంద్రమును అధ్యయనం చేయవలసిందిగా కోరారు. గణేష్ విజయనగర్ వెళ్లి ఒక ప్రాథమిక సంసాధన కేంద్రమును అధ్యయనం చేసి పాలకవర్గమునకు దిగువ వివరములను సమర్పించారు.

ప్రాథమిక సంసాధన కేంద్రం కూరగాయల సేకరణకు,శుభ్రపరచుటకు, వేరుచేయుటకు మరియు గ్రేడింగ్‌కు అవసరమైన వసతులు కలిగి ఉండవలెను. ప్రాథమిక సంసాధన కేంద్రం పెద్ద కొనుగోలుదారులకు సరఫరా చేయుటకు కావలసిన అన్ని మౌలిక సదుపాయములు కలిగి ఉండవలెను. క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రాంతం మరియు పరిసర ప్రాంతములో కూరగాయల సేకరణకు గల అవకాశములను పరిగణన లోనికి తీసుకొని రోజువారీ సేకరణ మరియు సరఫరా 10–15 టన్నులు అని అంచనా వేయటము జరిగినది. ప్రాథమిక సంసాధన కేంద్రం ఏర్పాటుకు కావలసిన స్థలం 15 సంవత్సరముల కొరకు లీజుపై తీసుకొనడం జరిగినది.

**రైతు ఉత్పత్తిదారుల సంస్థ**

దిగువ ప్రాథమిక సంసాధన కేంద్రమునకు అంచనా వేసిన పెట్టుబడి.

| క్రమ సం. | వస్తువు | | అంచనా వ్యయం (రూ.లలో) |
|---|---|---|---|
| 1. | షెడ్ మరియు ప్లాట్‌ఫారం | | 11,00,000 |
| 2. | ప్లాస్టిక్ క్రేట్స్ |   | 1,25,000 |
| 3. | గ్రేడింగ్ టేబుల్ |  | 55,000 |
| 4. | చెక్క ప్యాలెట్ (కొత్త గట్టి చెక్క 48×40×4-1/2"- నాలుగు వైపులా ప్రవేశించే ప్యాలెట్) |   | 35,000 |
| 5 | చేతి ప్యాలెట్ ట్రక్ (2 టన్నుల సామర్థ్యం) |  | 25,000 |

| | | |
|---|---|---|
| 6. సిల్పలిన్ షీట్ (వాషింగ్ షీట్ – హెచ్.డి.పి.ఇ) ప్లాస్టిక్ 5' మించకుండా ఎఎన్ఎస్ 2 6" ఫీట్ వెడల్పు) |  | 35,000 |
| 7. తూచే ప్లాట్‌ఫారం (300 కేజి సామర్థ్యం) |  | 25,000 |
| 8. ఇతర ఆస్తులు– చిన్న ఆఫీస్ టేబుల్, 3 కుర్చీలు, బీరువా, చెక్క గడ్డపారలు, పార | | 1,50,000 |
| 9. విద్యుత్ సరఫరా & ట్రాన్స్ఫార్మర్ | | 50,000 |
| మొత్తం | | 16,00,000 |

నివేదిక సమర్పణ తరువాత క్రిషి పాలకవర్గ సభ్యులు ప్రాధమిక సంసాధన కేంద్రం ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని అంగీకరించారు. వారు ఆ పనిని పాలకవర్గ ఉప కమిటీకి అప్పగించారు.

మన రైతు ఉత్పత్తిదారుల సంస్థలో కూడా ప్రాధమిక సంసాధన కేంద్రం ఏర్పాటు చేయవలసిన అవసరాన్ని అంచనా వేద్దాము. ఈ ఏర్పాట్లలో మనకు తగిన విధంగా కొన్ని మార్పులు, చేర్పులు చేసుకోవలసి ఉంటుంది. (గోనె సంచులు, తేమ మీటర్, ధాన్య క్లీనర్ మొదలగునవి). ప్రధాన పంటలైన ధాన్యం, మొక్కజొన్న, కందులు, శెనగలు మొదలగు పంటలకు కూడా ఈ ప్రాధమిక సంసాధన సౌకర్యములు అందుబాటులో ఉంచాలి.


ప్రాథమిక సంసాధన కేంద్రం ఏర్పాటుకు పాలకవర్గ సభ్యులుగా మనం క్రింది కార్యక్రమములను ఏర్పాటు చేయాలి.

- భిన్నమైన ఉత్పత్తుల రాకను అంచనా వేయాలి.
- అవసరమైన డబ్బును పొందాలి (బ్యాంకు, ఉద్యానశాఖ మొదలగునవి)
- అవసరమైన భూమిని లీజు తీసుకోవాలి.
- అంచనాలు వివరముగా సేకరించాలి.
- ప్రాథమిక సంసాధన కేంద్రమును ఏర్పాటు చేయాలి.

# 3

# ద్వితీయ సంసాధన ద్వారా విలువ జోడింపు

## ఉద్దేశ్యములు




*ద్వితీయ సంసాధన (ఆధునిక) ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు గ్రహించుట*

*విలువ జోడింపు రకములు మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థ భిన్న స్థాయిలలో విలువ జోడింపు గురించి తెలిసికొనుట*

***విషయాంశములు :***

1. ద్వితీయ సంసాధన (ఆధునిక) ద్వారా విలువ జోడింపు
2. విలువ జోడింపు రకములు
3. వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారులు ఉపయోగించే ఉత్పత్తులుగా మారడానికి సంసాధన
4. రైతు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ మరియు ఫెడరేషన్ స్థాయిలలో సంసాధన కార్యక్రమములు




ప్రాథమిక సంసాధనలో ప్రాథమిక కార్యక్రమములు శుభ్రపరచుట, ఆరబెట్టుట, గ్రేడింగ్ మరియు ప్యాకింగ్ కాగా, వ్యవసాయ ఉత్పత్తులకు మరింత విలువ జోడింపుకు ద్వితీయ సంసాధన కూడా వున్నది. ద్వితీయ సంసాధనలో ఉత్పత్తులను వినియోగించుకొనుటకు వీలుగా వుండే విధముగా మార్చడం జరుగును (పప్పు, పిండి, నూనె మొదలగునవి). నిల్వ చేయుట (ఎక్కువ ధర పొందుటకు) మరియు ఎక్కువ డిమాండ్ వున్న ప్రాంతములకు రవాణా చేయుట ద్వారా మరింత విలువ జోడింపు జరుగును.



## 3.1. ద్వితీయ సంసాధన ద్వారా విలువ జోడింపు



మనం చూసినట్లు చాలా మటుకు వ్యవసాయ ఉత్పత్తులను ముడి సరుకు రూపములో వినియోగించుకొనలేము. వినియోగదారుడు వినియోగించే రూపము, ముడిసరుకుకు మధ్య చాలా వ్యత్యాసం వుంటుంది. ముడిసరుకు రూపాంతరం చెందే మధ్యలో అనేక మధ్యంతర ఉత్పత్తులు కూడా ఉంటాయి. ద్వితీయ సంసాధన కార్యక్రమముల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థ, ఉత్పత్తిదారుల మరియు వినియోగదారుల మధ్య దూరమును పూరించవచ్చును.

కొన్ని ఉదాహరణలు బిన్నమైన ఉత్పత్తులకు ద్వితీయ సంసాధన ద్వారా విలువను పెంచుటను కొన్ని ఉదాహరణలతో దిగువ వివరించటము జరిగినది.

## చిత్రం 4 : ద్వితీయ సంసాధన ద్వారా విలువ జోడింపు

| | | |
|---|---|---|
| సెనగలు  | నూర్పుట → తోలు వొలుచుట → ఆరబెట్టుట → మొత్తం గింజలు రూ. 45/కేజీ → మిల్లు పట్టించుట రూ. 60/కేజీ → పిండి రూ. 80/కేజీ |  |
| వేరుశనగ కాయలు  | ఆరబెట్టుట → విత్తన శుద్ధి & గ్రేడింగ్ రూ. 60/కేజీ → పొట్టు తీయుట తొలుచుట రూ. 70/కేజీ → బ్లాన్చెడ్ వేరుశనగ రూ. 90/కేజీ → కండిషనింగ్ & చల్లబరచుట → ఎక్స్‌పెల్లర్ → ఆయిల్ సీడ్ కేక్ రూ. 45కేజీ → ముడి నూనె → ఆయిల్ ఒడపోత శుభ్ర పరచుట 170/లీ |  |
| ధాన్యం  | నూర్పుట → ఆరబెట్టుట → పాక్షికంగా ఉడికించుట రూ. 20/ కేజీ → మిల్లింగ్ → శుభ్రపరచుట & పొట్టుతీయుట → పాలిషింగ్ రూ. 45/ కేజీ<br>ఉప ఉత్పత్తులు : నూకలు (రూ. 18 / కేజి), బియ్యం పొట్టు, గడ్డి, తవుడు (రూ. 9 / కేజి), తవుడు నూనె (రూ. 95 / లీటర్)<br>బియ్యం ఉత్పత్తులు → అటుకులు రూ. 38/ కేజీ → ఫ్లకేడ్ బియ్యం రూ. 35/ కేజీ → పులిసిన బియ్యం ఉత్పత్తులు ఇడ్లీ, దోసె రూ. 27/ కేజీ → తినుబండారాలు తయారు – మురుకులు రూ. 95/ కేజీ |  |

## చిత్రం 4 : ద్వితీయ సంసాధన ద్వారా విలువ జోడింపు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| టమాట  | ఇతర పదార్ధములను తొలగించుట, ముచికలు తీయుట, మట్టి, పువ్వుల భాగాలు. 7 / కేజీ శుభ్రపరచనిది | ఆకారం లేని, పండని టమాట తొలగించుట | రంగు ప్రకారం గ్రేడింగ్ చేసిన టమాట | ఆకారం, సైజు ప్రకారం గ్రేడింగ్ చేయుట | గ్రేడింగ్ చేసినవాటిని నీటితో శుభ్రం చేయుట రూ. 20/కేజి–ఎ గ్రేడ్ | | |  |
| మ్యాంగో  | పండినవి మామిడి | కడుగుట | వేరుచేయుట రూ. 60/కేజీ | తొక్క తీయుట | కోయుట | ఆరబెట్టుట | మామిడిముక్కల ప్యాకింగ్ రూ. 300 / కేజీ |  |
|  | ఆకుపచ్చని మామిడి | కడుగుట | వేరుచేయుట రూ. 40/ కేజీ | చెడిపోయిన / పండనవి తొలగించుట | చెట్నీ / ఊరగాయ తయారీ రూ. 100/ కేజీ | | |  |
| ఫింగర్ మిల్లెట్ | శుభ్రపరచుట | గ్రేడింగ్ | అనవసరమైనవాటిని తొలగించుట | పొట్టు తీయుట రూ. 30/కేజీ | మిల్లింగ్ | పిండి రూ. 60 / కేజీ | |  |

## 3.2. విలువ జోడింపు రకములు

ద్వితీయ సంసాధనలో వ్యవసాయ ఉత్పత్తుల విలువ జోడింపు ప్రధానముగా నాలుగు విధాలుగా జరుగుతుంది. అవి విలువ జోడింపు, సమయం, విలువ జోడింపు ప్రాంత విలువ జోడింపు మరియు సమాచార విలువ జోడింపు. పై రెండు, మూడు మార్గాలలో పెంచవచ్చును. ఉదాహరణకు డిసెంబర్–జనవరి నెలలో కందులు సేకరించి, పప్పుగా మార్చి, వాటిని జూన్ వరకు నిల్వ చేసి లేబుల్ వేసి, సమీప పట్టణ ప్రాంతమునకు రవాణా  చేసి అమ్మవచ్చును. భిన్నమైన విలువ జోడింపు రకాలు దిగువ చిత్రములోచూపబడినవి.



**విలువ జోడింపు రూపం**

- రూపములో మార్పు
- ఉదాహరణ :

కందులుగా మార్చి పప్పు విలువ (రూ. 4,000/ క్వింటాల్ విలువ రూ. 10,000 వరకు పెరుగును.



**సమయం విలువ జోడింపు**

- వస్తువులను నిల్వ చేసి ధర పెరిగినప్పుడు విక్రయించుట
- ఉదాహరణ :

కందులు కోత సమయంలో సాధారణంగా ధరలు (రూ. 4,000–4,500 క్వింటాల్ వున్నప్పుడు సేకరించి డిసెంబర్ – జనవరి వరకు వర్షాకాలం వరకు నిల్వ చేసి ధరలు పెరిగినప్పుడు అమ్మిన (రూ. 5000–6000 లు) క్వింటాల్‌కు లభించును.



**స్థల విలువ జోడింపు**

- ఒక ప్రాంతము నుండి మరొక ప్రాంతమునకు రవాణా చేసిన విలువ పెరుగును.

ఉదాహరణ :

టమాటలు ఉత్పత్తి దారుని నుండి రూ. 5 కేజీ నుండి ఒక రాత్రి రవాణా ద్వారా వినియోగదారుని చేరేటప్పటికి వాటి ధర రూ. 20 కి పెరుగును.




**సమాచార విలువ జోడింపు**

- ఉత్పత్తి గురించి సమాచారం వినియోగదారునికి చేరగానే విలువ పెరుగును.

ఉదాహరణ :

ఉత్పత్తికి ఆర్గానిక్ లేదా కొవ్వు ఫ్రీ అని చేర్చిన వినియోగదారుని స్థాయిలో విలువ పెరిగి చెల్లించడానికి సిద్ధపడును.

*చిత్రం 5 : విలువ జోడింపు రకములు*

## 3.3. సంసాధన కార్యక్రమములు భిన్నమైన స్థాయి

దిగువ చిత్రములో చూపిన విధముగా భిన్నమైన విలువ జోడింపు కార్యక్రమములు వివిధ స్థాయిలలో చేపట్టవలెను.

| | | |
|---|---|---|
| రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య | మిల్లింగ్, గోదాము, ఉత్పత్తి పంపిణి, లేబులింగ్ & బ్రాండింగ్ |  |
| ప్రాథమిక ఎఫ్.పి.ఓ. | గ్రేడింగ్, ప్యాకింగ్ మరియు స్థానిక రవాణా | |
| రైతు | శుభ్రపరచుట, ఆరబెట్టుట, గోనె సంచులలో నింపుట | |

భిన్నమైన విలువ జోడింపు కార్యక్రమములు వివిధ స్థాయిలలో చేపట్టవలెను. మనం గతములో వివరించిన విధముగా విలువ జోడింపు కార్యక్రమములో, శుభ్రపరచుట, ఆరబెట్టుట మరియు గోనె సంచులలో నింపుట మొదలగునవి రైతు స్థాయిలో చేపట్టవలెను.

ఇప్పుడు గ్రేడింగ్, ప్యాకింగ్ మరియు స్థానిక రవాణా లాంటి కార్యక్రమములను తీసుకుందాము. ఈ కార్యక్రమములు ప్రాథమికమైనందున తక్కువ పరిమాణములో కూడా చేపట్టవచ్చును. కనుక ఈ కార్యక్రమాలను ప్రాథమిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ (క్రిషి,వసుంధర మొదలగునవి) స్థాయిలో చేపట్టవచ్చును. తరువాత కార్యక్రమములైన దాల్ మిల్లు, నూనె మిల్లు, గోదాము, ఉప ఉత్పత్తులు (పండు

గుజ్జు) తయారీ, ఉత్పత్తి పంపిణి, మార్కెట్‌కు పంపించడం అనేవి పెద్ద స్థాయి కార్యక్రమములు. ఈ కార్యక్రమములు పెద్ద స్థాయిలో చేపట్టవలసినవి. చిన్నస్థాయిలో ఈ కార్యక్రమములు చేపట్టాలంటే అవి ఆర్థికముగా మరియు సాంకేతికముగా సాధ్యం కావు. ఉదాహరణకు ఒక పప్పు మిల్లులో గంటకు 2 టన్నుల సామర్థ్యం, గోదాము 500 టన్నులు మొదలగునవి. కనుక ఈ కార్యక్రమములకు ఎక్కువ వ్యాపారం లేదా ముడిసరుకు అవసరం అవి ప్రాథమిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో చేపట్టుట చాలా కష్టము.

ఇటువంటి పెద్ద స్థాయి కార్యక్రమములకు ప్రత్యేక ప్యాకింగ్ లేబులింగ్ మరియు బ్రాండింగ్ అవసరం. వాటికీ ఎక్కువ పరిమాణం మరియు పెట్టుబడి అవసరం. కనుక ఇటువంటి కార్యక్రమములను రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమాఖ్య స్థాయిలో చేపట్టవలసిన అవసరం వుంది. జైకిసాన్ ఫెడరేషన్ లాంటి సంస్థలో కావలసిన ముడి సరుకు, వ్యాపార పరిమాణం మరియు సాంకేతిక సాధ్యత ఉండును.

అయితే ఒక పెద్ద రైతు ఉత్పత్తిదారుల సంస్థలో (3000-5000) మంది సభ్యులు వున్న మరియు ముడి సరుకు లభ్యత ఉన్నప్పుడు ఇటువంటి కార్యక్రమములు ఒక్క రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో కూడా చేపట్టవచ్చును. సాధారణముగా ప్రాథమిక సంసాధన ప్రాథమిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో మరియు ద్వితీయ సంసాధన రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్ స్థాయిలో లేదా పెద్ద స్థాయిలో చేపట్టవలెను. ఇది చాలా ముఖ్యం. విలువ జోడింపు కార్యక్రమములు సరైన స్థాయిలోనే చేపట్టవలెను. అప్పుడే అవి లాభదాయకం మరియు సాధ్యము అవుతాయి.

రాబోయే పాఠ్యాంశములో ప్రతీ విలువ జోడింపు అంశమును వివరముగా చూద్దాము. ఇటువంటి అనేక అంశములు తెలిసికొనడానికి జైకిసాన్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఫెడరేషన్ రాజాపేట గురించి చూద్దాము.

## 3.4. జైకిసాన్ ఫెడరేషన్

మనము 2వ పుస్తకం పరికల్పనలో తెలుసుకున్నట్లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు తమ సమాఖ్య ఏర్పాటు చేసుకోవచ్చు. అంటే వ్యక్తిగత రైతులు ఉత్పత్తిదారుల సంస్థలో సభ్యత్వము పొందినట్లే, ఎఫ్.పి.ఓ.లు అన్నీ కలిసి తమ సమాఖ్యను ఏర్పాటు చేసుకోవచ్చు. జై కిసాన్ ఫెడరేషన్ అదే విధముగా ఏర్పడినది. దాని వివరములు దిగువన ఇవ్వబడినవి.

**జై కిసాన్ రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్ ఉత్పత్తిదారుల కంపెన లిమిటెడ్, రాజాపేట**

జై కిసాన్ రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్ రెండు సంవత్సరముల క్రితం ఏర్పాటు అయినది. దీనిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థలైన క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థ, ధరణి మరియు వసుంధర తరువాత మరో రెండు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పృధ్వి అండ్ సస్య ఫెడరేషన్‌లో సభ్యత్వం పొందాయి. ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ వాటాధనముగా ఫెడరేషన్‌కు రూ. 50,000 లు చెల్లించాయి. రాజాపేట అన్ని రైతు ఉత్పత్తిదారుల సంస్థల ప్రాంతాలకు మధ్యలో వుంది. రోడ్ ద్వారా కలుపబడినది.

ఫెడరేషన్‌లోని ఐదు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు దగ్గరగా దగ్గరగా వున్నవి. అలాగే ఈ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రాంతములో వ్యవసాయ పరిస్థితులు మరియు పంటల విధానం ఒకేవిధంగా ఉన్నాయి. దిగువ జైకిసాన్ ఫెడరేషన్‌లో చేరిన సభ్య రైతుఉత్పత్తిదారుల సంస్థల వివరములు పొందుపరచబడినవి.

| రైతు ఉత్పత్తిదారుల సంస్థ పేరు | సభ్యుల సంఖ్య | ప్రధాన పంటలు | వారి కార్యక్రమాలు |
|---|---|---|---|
| క్రిషి ఎఫ్.పి.ఓ. | 900 | వేరుశనగ, కందులు, కూరగాయలు, రాగి, కొర్రలు | ఉత్పత్తి అవసరములు సరఫరా, వ్యవసాయ యంత్రములు, విత్తన ఉత్పత్తి & ఉత్పత్తుల సేకరణ మార్కెటింగ్, ప్రాధమిక సంసాధన కేంద్రముల ఏర్పాటు |
| ధరణి ఎఫ్.పి.ఓ. | 700 | కందులు, శనగలు, మిరప, ఉల్లి, పత్తి | ఉత్పత్తి అవసరముల పంపిణీ, వ్యవసాయ యంత్రములు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ |
| వసుంధర ఎఫ్.పి.ఓ. | 800 | వేరుశనగ, కందులు, కూరగాయలు, రాగి, కొర్రలు | ఉత్పత్తి అవసరములు సరఫరా, వ్యవసాయ యంత్రములు, విత్తనముల సరఫరా, ఉత్పత్తుల మార్కెటింగ్, ప్రాధమిక సంసాధన కేంద్రముల ఏర్పాటు |
| పృధ్వి ఎఫ్.పి.ఓ. | 850 | ధాన్యం, కందులు, శనగలు, ప్రత్తి | ఉత్పత్తి అవసరములు సరఫరా, ఉత్పత్తుల మార్కెటింగ్ |
| సాస్య ఎఫ్.పి.ఓ. | 650 | మొక్కజొన్న, ధాన్యం, శనగలు | ఉత్పత్తి అవసరముల సరఫరా, వ్యవసాయ యంత్రముల అద్దె |

జైకిసాన్ సమాఖ్య 15 మంది డైరెక్టర్ల బోర్డును కలిగి వున్నది. క్రిషి మరియు పృధ్వి ఎఫ్.పి.ఓల నుండి చెరి ముగ్గురు చొప్పున, మిగిలిన ఎఫ్.పి.ఓల నుండి ఇద్దరు చొప్పున ఎన్నిక కావటం జరిగినది. అంతేగాక మరో ముగ్గురు వ్యక్తిగత డైరెక్టర్స్ ఉన్నారు. ప్రతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు ఒక సంవత్సరం పాటు రొటేషన్ ప్రాతిపదికన అధ్యక్షులుగా ఎన్నిక కాబడతారు.

ఈ ఐదు రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో 3900 మంది సభ్యులు వున్నారు. వసుంధర రైతు ఉత్పత్తిదారుల సంస్థలో అందరు మహిళా రైతులు వున్నారు. జైకిసాన్ ఫెడరేషన్‌లో నలుగురు సిబ్బంది వున్నారు. ముఖ్య కార్యనిర్వహణాధికారి, మార్కెటింగ్ మేనేజర్, అకౌంటెంట్ మరియు వ్యవసాయ నిపుణుడు.

జై కిసాన్ ఫెడరేషన్ సభ్యులు చాలా చురుకు మరియు భిన్నమైన వ్యాపార కార్యక్రమములను చేపట్టారు. వారికి ఫెడరేషన్‌పై పూర్తి నమ్మకం, గౌరవం మరియు తమ స్వంతమనే భావనతో ఉన్నారు. వారు ఆ ప్రాంతములోని వ్యవసాయ కుటుంబముల ప్రయోజనము కొరకు పెద్ద స్థాయిలో అవసరమైన కార్యక్రమములను చేపట్టాలని భావిస్తున్నారు.

ఇప్పటి వరకు మనము జై కిసాన్ ఫెడరేషన్ ప్రాధమిక రూపమును చూశాము. ఇప్పుడు ఇతర కార్యక్రమముల వివరములలోకి వెడదాము.




## వివరములు

జై కిసాన్ ఫెడరేషన్ పరిచయములో తెలిపిన ప్రకారం కందులు, శెనగలు మరియు పెసలు సగం కంటే ఎక్కువమంది సభ్యులకు ప్రధాన పంటలు అయినప్పటికీ ఈ రైతులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ముఖ్యముగా ఈ పంటల కోత సమయములో జై కిసాన్ ఫెడరేషన్ పాలకవర్గం ఈ ఇబ్బందులను గురించి అనేక సమావేశములలో తీవ్రముగా చర్చించారు.

రైతు ఉత్పత్తిదారుల సభ్యులు తాము సమిష్టిగా కొంతవరకు ఈ పప్పు ధాన్యాల మార్కెటింగ్ చేపట్టినప్పటికీ, అమ్మకపు ధర మార్జిన్ ఎక్కువగా లేదని అభిప్రాయపడ్డారు. చాల సమయములలో క్వింటాల్‌కు రూ.5000 మరియు ఈ ఉత్పత్తుల ధరలు పెద్ద స్థాయిలో హెచ్చు తగ్గులు ఉంటాయని వాపోయారు.

### కందుల వివరములు

### (వినియోగదారుని స్థాయిలో క్వింటాల్ రూ.8,000) భిన్నమైన వ్యవస్థల మధ్య ధరల మార్పు




పై వివరణను జోడిస్తూ కందుకుల వినియోగదారుడు రూ. 8000/– చెల్లిస్తుంగా, రైతుకు మొత్తం కంది పంట విలువలో కేవలం 35% భాగం మాత్రమే పొందుతున్నారని, చాలా ఎక్కువ మార్జిన్‌ను మిల్లర్లు మరియు వర్తకులు పొందుతున్నారని నిపుణ డైరక్టరు మరియు మార్కెటింగ్ మేనేజర్ వివరించారు.

*పాలకవర్గ సభ్యులుగా మనం అవసరమైన సభ్యుల విద్యా కార్యక్రమాల ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థ వివిధ స్థాయిలలో సభ్యుల వ్యవసాయ ఉత్పత్తిని శుభ్రపరచుట మరియు ఆరబెట్టుట వంటి తగిన కార్యక్రమములను చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.*

4

# మిల్లింగ్ - రూపం విలువ జోడింపు

## ఉద్దేశ్యములు




*ద్వితీయ సంసాధన (ఆధునిక) ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు గ్రహించుట*

*వినియోగదారులు ఉపయోగించడానికి అనువుగా వ్యవసాయ ఉత్పత్తుల విలువ జోడింపుతో రూపం మార్చడాన్ని తెలిసికొనుట*

***విషయాంశములు :***

1. ద్వితీయ సంసాధన (ఆధునిక) ద్వారా విలువ జోడింపు ఆకృతి
2. విలువ జోడింపు సాధ్యత
3. విలువ వర్సెస్ వ్యయం




## పప్పుమిల్లు ఆలోచన

జైకిసాన్ రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్‌కు చాలాకాలము నుంచి సొంత పప్పుమిల్లు కలిగి ఉండాలనే ఆలోచనలో వున్నది. దీని కొరకు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఈసారి పాలకవర్గ సమావేశములలో మరియు ఫెడరేషన్ సమావేశంలో చర్చకు వచ్చినది. జైకిసాన్ పాలకవర్గం ఈ విషయమై నిర్ణయం చేయాలని తీవ్రముగా ఆలోచన చేయుచున్నది.

జై కిసాన్ పాలకవర్గం చాలా తొందరగా పప్పు మిల్లు ఏర్పాటు చేయడానికి గాను ఒక ఉప కమిటీ ఏర్పాటు చేసినది. ఉప కమిటీలో ముగ్గురు డైరెక్టర్లను (ఒక నిపుణుడైన డైరెక్టర్‌తో సహా) మరియు మార్కెటింగ్ మేనేజర్ సభ్యులుగా ఉన్నారు. ఉప కమిటీ అనేక ప్రదేశములను సందర్శించినది. విజయనగర్,

పప్పు మిల్లు క్లస్టర్ పొరుగు రాష్ట్రములో, ప్రధాన పప్పు మార్కెట్లను సందర్శించినది. ఉపకమిటీ సభ్యులు మిల్లర్లు, టోకు వర్తకులు, జిల్లా పరిశ్రమల అధికారి, బ్యాంకులు, సాంకేతిక నిపుణులు, పంచాయత్ రాజ్ విభాగం ఇంజనీర్ మరియు కొందరు చిల్లర వర్తకులతో కూడా మాట్లాడినది.

పొరుగు రాష్ట్రములో పప్పు మిల్లు క్లస్టర్‌ను ఒక ప్రత్యేక పారిశ్రామిక జోన్ ఏర్పాటు చేయడము అనేది చాలా గొప్ప విజయం. అనేక మంది సలహాపై ఫెడరేషన్ పాలకవర్గ సభ్యులు మరియు సిబ్బంది రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులతో కలసి వెళ్లి క్లస్టర్ను సందర్శించి ఎంతో ప్రభావితమయ్యారు.

పప్పు మిల్లు ఏర్పాటుకు ముందస్తు సాధ్యాసాధ్యాలు అంచనా వేసారు. దాని వివరములు అనుబంధం –1లో నివేదించబడినవి.

## 4.1. దాల్ మిల్లు : తదుపరి చర్యలు

సభ్యులకు ప్రయోజనం మరియు పప్పు మిల్లుకు సానుకూలత వున్నందువలన పప్పు మిల్లు ప్రాజెక్టుకు జై కిసాన్ ఫెడరేషన్ పాలకవర్గం చాలా ఉత్సాహంగా వున్నారు. అయితే మిల్లు ఏర్పాటు మరియు నడుపుటకు సాంకేతిక వివరములపై స్పష్టత లేనందున పాలకవర్గము ఇంకా సిద్ధముగా లేదు. నిపుణుడైన డైరెక్టర్ మరియు సమయానికి వివరముగా పప్పు మిల్లు ప్రాజెక్ట్ అధ్యయనం చేసే విషయములో సాంకేతిక ఏజెన్సీ తీసుకురావటములో పురోగతి సాధించాడు.

సమీప మెట్రో నగరంలో వున్న ఈ సాంకేతిక ఏజెన్సీ ఆహార పదార్థములకు సంబంధించిన ప్రాజెక్ట్స్‌లో నైపుణ్యం కలిగిన ఏజెన్సీ. ఈ ఏజెన్సీ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రాజెక్ట్ యొక్క ఆర్థిక అంశములు మరియు అవసరమైన ఆర్థిక వనరుల కొరకు బ్యాంకు సంబంధిత ప్రాజెక్ట్ ప్రతిపాదనలు అభివృద్ధి చేయును. సాంకేతిక ఏజెన్సీ నైపుణ్యంపై ఆకర్షితులైన జైకిసాన్ ఫెడరేషన్ పాలకవర్గం పప్పు మిల్లు గురించి అధ్యయనం చేసి వివరమైన ప్రాజెక్ట్ నివేదిక అందజేయడానికి వారిని నియమించుకోవాలని నిర్ణయించినది.

మూడు నెలల తరువాత జైకిసాన్ ఫెడరేషన్ పాలకవర్గమునకు మరొక ఆసక్తికరమైన సమావేశం జరుగుతున్నది. ఈ సమావేశములో పాలకవర్గ దీర్ఘకాల నిరీక్షణ నెరవేరినది. సాంకేతిక ఏజెన్సీ ప్రాజెక్ట్ నివేదిక సిద్ధం చేసి పాలకవర్గమునకు నివేదించడానికి సిద్ధమైనది. నిజానికి ఫెడరేషన్ పాలకవర్గ సభ్యులే కాకుండా, సిబ్బంది, సభ్య రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధులు, సిబ్బంది మరియు అనుభవం కలిగిన ఇతర వ్యక్తులు కూడా సమావేశములో పాల్గొంటున్నారు.



**పప్పు మిల్లు ప్రాజెక్ట్ వివిధ అంశములను అనుబంధం-2 లో నివేదించబడినవి.**

**సొంత సంసాధన మరియు జాబు వర్క్**


జిల్లా కేంద్రము విజయనగర్‌లో పప్పు మిల్లులు వున్నాయి. కానీ పప్పు ధాన్యాలను, ఈ పప్పు మిల్లులో సంసాధన చేయించడానికి దిగువ ఇబ్బందులు వున్నాయి.

- అధిక రవాణా ఖర్చు.
- అవసరమైన సమయములో సంసాధన లభించే హామీ లేకపోవుట.
- నాణ్యతా నష్టం మరియు తూకం నష్టము.

కందుల సొంత సంసాధన మరియు వేరొకరికి సంసాధన చేయటానికి, విశ్లేషణ క్వింటాల్‌కు దిగువ ఇవ్వబడినది. వేరొకరికి సంసాధన చేసి పెట్టటము కన్నా సొంత సంసాధనలో లాభము మార్జిన్ ఎక్కువగా వున్నదని దిగువ సమాచారము సూచిస్తున్నది.

| కందుల లాభదాయకత (రూ.క్వింటాల్‌కు) | | | |
|---|---|---|---|
| వరుస సంఖ్య | వివరములు | సొంత సంసాధన | ఇతరులకు సంసాధన చేసి ఇవ్వటము |
| 1 | ముడి సరుకు వ్యయం | 4500 | 4500 |
| 2 | సంసాధన వ్యయం | 300 | 800 |
| 3 | మొత్తం వ్యయం | 4800 | 5100 |
| 4 | అమ్మకం ధర | 6500 | 6300 |
| | **లాభం** | 1700 | 1000 |

## విలువ మరియు వ్యయం



మనం దృష్టిలో పెట్టుకోవలసినది ఏమిటంటే విలువ జోడింపు కు కొంత వ్యయం అవుతుంది. పైన ఉదాహరణలో పేర్కొన్న ప్రకారం ఒక క్వింటాల్ కందులను పప్పుగా మార్చడానికి రూ. 300 వ్యయం అగును. అంటే వ్యయం లేకపోతే విలువ జోడింపు లేదు. విలువ జోడింపు కన్నా వ్యయం అధికం అంటే ఏమిటి? రైతు ఉత్పత్తిదారుల సంస్థకు నష్టం.. కనుక విలువ జోడింపు అయ్యే ఖర్చు కన్నా విలువ అధికముగా వుండాలి. అప్పుడే నికర లాభం ఉంటుంది.

ఉదాహరణ : పై కేసులో వ్యయం రూ.300లతో విలువ జోడింపు వల్ల రూ.2000లు అదనంగా లాభం చేకూర్చబడింది. (అమ్మకపు ధర 6500 మైనస్ ముడిసరుకు వ్యయం రూ.4500)

**పప్పు మిల్లు : ప్రణాళిక**

సాంకేతిక ఏజెన్సీ నివేదిక సమర్పణ మరియు నివేదికపై కూలంకుషమైన చర్చలు జరిగినవి. పప్పు మిల్లు కలిగి వుండాలన్న ఆలోచన సంవత్సరం క్రిందటి నుంచి చర్చలలో వున్నది. జైకిసాన్ ఫెడరేషన్ పాలకవర్గం దీనికి తొందరలో ముగింపు పలకాలని కోరుకున్నది. సమావేశములోని పాలకవర్గ సభ్యులు మరియు ఇతరులు ఆకర్షితులై పప్పు మిల్లు నెలకొల్పడానికి సుముఖత వ్యక్తపరచారు. వారు సొంత పప్పు మిల్లు కలిగి ఉండటానికి, తమ కల నెరవేర్చుకొనడానికి సిద్ధంగా వున్నారు.

జైకిసాన్ ఫెడరేషన్ పప్పు మిల్లు కథ స్థాపన నిజమైనది. పప్పు మిల్లు వ్యాపారం కీలక అంశములు దిగువ పొందుపరచబడినవి.

**పప్పు మిల్లు వ్యాపార నమూనాలో కీలక అంశములు**

**ఒకే ప్రాంతములో ముడి సరుకు లభ్యత –** ముడి సరుకు సేకరణ వ్యయం తగ్గించుటకు వీలుపడింది.

**బహుళ ఉత్పత్తులు –** సామర్థ్య వినియోగమును గరిష్టము చేయుటకు సంవత్సరములో ఎక్కువ సమయం పని చేస్తూ ఉండుటకు వీలవుతున్నది.

**ఇతరులకు సంసాధన చేసి పెట్టడము :** ఇతరులకు సంసాధన చేయడం ద్వారా సంవత్సరములో ఎక్కువ సమయం పని చేస్తూ ఉండుట వలన సామర్థ్య వినియోగం – గరిష్ట స్థాయిలో సామర్థ్య వినియోగం లాభదాయకతను కలిగించును.

**పూర్తి స్థాయి ఉత్పత్తి –** నాణ్యమైన ముడిసరుకు మరియు సమర్ధవంతంగా నడపటం ద్వారా పూర్తి స్థాయి ఉత్పత్తిని సాధించవచ్చును.

**అభ్యాసం: జైసన్ కిసాన్ ఫెడరేషన్ పప్పు మిల్లు కేసు ఆధారముగా మనము అర్ధం చేసుకున్నది ఏమిటి?**

.............................................................................................................

.............................................................................................................

.............................................................................................................

.............................................................................................................

**అప్పగించిన పని :** ఈ సెషన్‌లోని చర్చల ఆధారముగా మన రైతు ఉత్పత్తిదారుల సంస్థ భిన్నమైన వస్తువులకు అవసరమయ్యే సంసాధన ప్రక్రియను నిర్ణయిద్దాము.

| ఉత్పత్తులు | అవసరమయ్యే ప్రాధమిక సంసాధన | అవసరమయ్యే ద్వితీయ సంసాధన |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |


***పాలకవర్గ సభ్యులుకు కీలక సూచనలు :***

- *వ్యాపారమునకు సానుకూలత అంచనా*
- *వ్యాపార వివరములు, దాని లాభదాయకతను తెలిసికొనుట*
- *విలువ జోడింపు వ్యయం కన్నా అధికమని నిర్ధారించుకోవాలి.*

5

# నిల్వ - సమయము విలువ జోడింపు

## ఉద్దేశ్యములు




రైతు ఉత్పత్తిదారుల సంస్థ తన వ్యాపార కార్యక్రమములకు నిల్వ అవసరం మరియు ప్రయోజనములు గుర్తించుట

గోదాము సానుకూలత అంచనాలో భిన్నమైన అంశములను అర్ధం చేసుకొనుట

గోదాముల ఏర్పాటు మరియు నడుపుటకు అవసరమయ్యే భిన్నమైన ఒప్పందముల గురించి తెలిసికొనుట


**విషయాంశములు :**

1. గోదాము అవసరం, ప్రయోజనములు మరియు సానుకూలత అంచనా
2. గోదాము వ్యాపారంలో కీలక అంశములు
3. గోదాము అనుసంధానములు




## పరిచయం

వ్యవసాయ ఉత్పత్తులను, వాటిని పండించినప్పటి నుండి మార్కెట్ చేసేవరకు నిల్వ అనేది ఒక ముఖ్యమైన మార్కెటింగ్ విధి. ఉత్పత్తుల సేకరణ మరియు సంసాధన తరువాత కొన్ని ఉత్పత్తులను నేరుగా అమ్మకమునకు చేస్తాము. అయితే అనేక ప్రయోజనములు పొందటానికి ఉత్పత్తులను నిల్వ చేయటం అవసరం.



**అభ్యాసం: నిల్వ చేయటము వలన కలిగే భిన్నమైన ప్రయోజనములు దిగువ రాద్దాము.**

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

.....................................................................................................

**ఇంతకుమునుపు మనము చర్చించనట్లు ఉత్పత్తులను నిల్వ చేయటము వలన క్రింద ప్రయోజనాలు వున్నవి :**

- దాదాపు అన్ని వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కోత సీజన్‌లో చాలా తక్కువగా వుంటాయి. కాలం గడిచే కొలది ధరలు పెరుగుతాయి.,రాబోయే పంట ఖర్చులు భరించుట కొరకు మరియు పాత బాకీలలో కొంత మొత్తమును తీర్చడానికి రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్ముకుంటారు. ఇటువంటి సమయములో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ధరలు పెరిగే వరకు పంటను నిల్వ చేయడం ద్వారా రైతులకు వచ్చే రాబడి పెంచవచ్చు.
- కందిపప్పు లాంటి కొన్ని ఉత్పత్తులకు పండగలు / వర్షాకాలములో డిమాండు వుంటుంది. ఫిబ్రవరి

2015లో కందుల ధరలు కేజీ రూ. 100కు తగ్గినది. తరువాత నవంబరుకు కేజి 175/- వరకు వెళ్ళినది. కానీ ఫిబ్రవరి 2016లో మరలా రూ.144కు తగ్గినది. నిల్వ ద్వారా అటువంటి సీజన్‌లను ఉపయోగించుకొని, ఉత్పత్తిని సంరక్షించుకొని సమయానుసారం విలువను పొందవచ్చును.

- ఉత్పత్తి అవసరములు సరఫరా మరియు విత్తనములకు కొంత సమయం సరుకు నిల్వలు అవసరము. ఉత్పత్తులను నిల్వ చేసి పోటీ ప్రయోజనాలను కలిగించుటకు నిల్వ సదుపాయము అవసరము.
- కనుక వ్యవసాయ ఉత్పత్తులను మరియు ఉత్పత్తి అవసరములను నిల్వ ఉంచుట మార్కెటింగ్‌లో ముఖ్యమైన విధి. పోటీ ప్రయోజనమును పొందటానికి మరియు ఏ వ్యాపార సంస్థకైనా మార్కెటింగ్ మరింత ప్రభావవంతముగా ఉండేలా నిల్వ సదుపాయం చేస్తుంది.

అయితే కొంత నిల్వ స్థానిక గోదాముల్లో చేయవచ్చును. అది తాత్కాలికమే కానీ పూర్తి సురక్షణ కాదు. కనుక పెరుగుతున్న సభ్యుల అవసరములకు అనుగుణముగా శాస్త్రీయ నిల్వ ప్రయోజనమును పొందటానికి సరైన గోదాములు అవసరం. నిల్వ గురించి మరింత తెలుసుకొనడానికి జైకిసాన్ రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్ గురించి తెలుసుకుందాము.

## 5.1. గోదాము వలన ప్రయోజనములు మరియు అవకాశములు

కొన్ని గోదాములను సందర్శించిన తరువాత మరియు సంబందిత కొంతమంది భిన్నమైన వ్యక్తులతో మాట్లాడిన తరువాత జై కిసాన్ ఫెడరేషన్ మార్కెటింగ్ ఉప కమిటీ గోదాముల వలన అనేక ప్రయోజనములు వున్నాయని అర్థం చేసుకున్నది. రైతు ఉత్పత్తిదారుల సంస్థకు ప్రత్యక్షముగా ప్రయోజనం కల్పించుటకు సేకరణ, సంసాధన మరియు ఉత్పత్తి అవసరముల సరఫరాలను చేపట్టవచ్చును.

ఉత్పత్తుల సరుకును నిలిపి ఉంచే సామర్థ్యముతో, రైతు ఉత్పత్తిదారుల సంస్థ తన వ్యాపార కార్యక్రమములను విస్తరించవచ్చును. తద్వారా ఎక్కువమంది సభ్యులకు తన సేవలను అందించవచ్చును. అలాగే గోదామును కలిగి వుండటం అనేక అవకాశములను కల్పిస్తుంది.


*చిత్రం 6 : గోదాముతో అవకాశములు*

**రైతు స్థాయిలో అవకాశములు**

- నిల్వ సదుపాయము వలన బాధతో అమ్మవలసిన అవసరం లేదు
- వివిధ అవసరములకు తాకట్టు అప్పు అందుబాటు
- కనీస మద్ధతు ధర (ఎంఎస్పీ) సేకరణకు మంచి అవకాశం

**రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో అవకాశములు**

- నిల్వ ఉంచే సామర్థ్యం వలన బేరమాడే శక్తిని కలిగి ఉండవచ్చు.
- ఎఫ్.పి.ఓ చే బ్యాంకుల వద్ద నుండి నెగోషియబుల్ గోదాము రసీదుపై రుణం పొందవచ్చు.
- గోదాము ఒక మార్కెట్ స్థానముగా అనేక మంది కొనుగోలుదారులను ఆకర్షించవచ్చును.
- గోదాములు ఎలక్ట్రానిక్ స్పాట్ ఎక్స్చేంజిలలో పాల్గొనవచ్చును.



పైన తెలిపిన విధముగా గోదాం కలిగి వుండటం వలన నిల్వ చేసే అవకాశములు కలుగుతాయి, అందుబాటులో ఋణములు మరియు కనీస మద్దతు ధర (ఎంఎస్పి) ద్వారా సేకరణ రైతులకు, రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అవకాశములు, మెరుగైన బేరమాడే శక్తి, బ్యాంకు ఋణములు, కొనుగోలుదారులను ఆకర్షించుట మరియు ఎలక్ట్రానిక్ స్పాట్ ఎక్స్చేంజి (ఎలక్ట్రానిక్ వర్తక ప్లాట్‌ఫారం వస్తువులకు)లో పాల్గొనే అవకాశములు కలుగుతాయి.

# Negotiable Warehouse Receipt / परक्राम्य भांडागार रसीद

FORM A
प्रपत्र क

**See section 11 of the Warehousing Development and Regulation Act, 2007**

**भांडागार (विकास और विनियम) अधिनियम, 2007 की धारा 11 देखिए**

Name and Location of Warehouse / भांडागार का नाम और स्थान

1. Receipt Number : रसीद संख्या : Dated: ................ तारीख :

2. Name & complete postal address of Warehouse ................
भांडागार का नाम और पूरा पता :
................
................

3. Warehouse Registration No ................ Valid up to ................
भांडागार की पंजीकरण संख्या : तक मान्य

4. Received from (Name and address of the depositor) ................
जिससे स्टाक प्राप्त किया (जमाकर्ता का नाम एवं पता) :
................
................

5. Goods of following descriptions :
प्राप्त की गई वस्तुओं का विवरण :

| Commodity वस्तु | Description of Commodity, with quality/grade etc. गुणवत्ता एवं ग्रेड इत्यादि सहित वस्तु का विवरण | No. of Packages/ bags पैकेजों / बोरों की संख्या | Net Quantity in MTs/Qtls मी. टन / क्विंटल में कुल मात्रा | Market value at the time of deposit जमा के समय बाजार दर | Total Market Value कुल बाजार मूल्य | Godown / Stack Number गोदाम / चट्टा संख्या |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |

6. Private marks of the depositor on the packages, if any ................
पैकेजों पर जमाकर्ता का निजी चिन्ह, यदि कोई हो :

7. Rate of storage and handling charges ................
भंडारण दर एवं रख-रखाव प्रभार :

8. Insured for fire, floods, theft, burglary, misappropriation, riots, strikes or terrorism ................
आग, बाढ़, चोरी, सेंधमारी, हेराफेरी, दंगा-फसाद या आतंकवाद आदि के लिए बीमा :

9.

| Name of the Insurance policy बीमा पालिसी का नाम | Policy No. पालिसी संख्या | Insured for the amount of Rs. बीमा धनराशि | Period of validity मान्य अवधि | | Name of the Insurance company बीमा कंपनी का नाम |
|---|---|---|---|---|---|
| | | | From से | To तक | |
| | | | | | |

10. The goods are accepted for storage from date ................ to ................
भंडारण के लिए माल की स्वीकृति ................ तक ................

11. The receipt is valid up to ................ being the date of expiry of the declared shelf-life.
यह रसीद तारीख ................ तक वैध है क्योंकि इसी दिनांक तक घोषित आयु है।

Name and Signature of Warehouseman /
authorized official with seal
Tel. No. ................
भांडागार / प्राधिकृत अधिकारी का नाम एवं हस्ताक्षर

## గోదాము అవసరం

జై కిసాన్ ఫెడరేషన్ మరియు వారి సభ్య రైతు ఉత్పత్తిదారుల సంస్థలు గత 2 సంవత్సరముల నుండి సేకరణ మరియు మార్కెటింగ్ కార్యక్రమములను చురుకుగా నిర్వహిస్తున్నాయి. అయినప్పటికీ నిల్వకు సంబంధించి వారు దిగువ ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థ పని చేసే ప్రాంతములో సరైన గోదాము సదుపాయం లేదు. సమీప గోదాము 40 కిలో మీటర్ల దూరములో విజయనగర్‌లో వున్న రాష్ట్ర గోదాముల సంస్థ గోదాము మాత్రమే సమీపములో వున్నది. ఈ దూరమును దృష్టిలో పెట్టుకుంటే రవాణా వ్యయం ఎక్కువ. అయినప్పటికీ గత సంవత్సరం ఈ గోదాములో అద్దెకు కొంత స్థలం కొరకు ప్రయత్నం చేసినది. కానీ ఎక్కువ డిమాండ్ వలన స్థలం లభించలేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఫెడరేషన్ తక్కువ ధరకు క్వింటాల్ రూ.5500కు విక్రయించినది. అయితే అప్పటినుండి 3 నెలల కాలములో ధర రూ.6500కు పెరిగినది.

అయితే సభ్య రైతు ఉత్పత్తిదారుల సంస్థ కొన్ని స్థానిక గోదాములను అద్దెకు తీసుకున్నవి. అవి పాతభవనములు అయినందున నేల, పై కప్పు సరిగాలేవు. అందువల్ల చీడలు పట్టి మరియు తేమ చొరబడి సరుకు నాణ్యత తగ్గి, సరుకు ధర పడిపోయింది. నాసిరకం సౌకర్యముల వలన గోదాములు భీమాకు మరియు బ్యాంకు ఋణములకు అర్హత సాధించలేవు.

గోదాముకు సాధ్యాసాధ్యాలు అనుబంధం 3 లో నివేదించబడినది.

## జైకిసాన్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ గోదాము ప్రతిపాదన

నిరంతర వ్యాపార అవసరం మరియు సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకొని జైకిసాన్ ఫెడరేషన్ సొంత గోదామును కలిగి వుండాలని నిర్ణయం తీసుకున్నది. పాలకవర్గం నిపుణుడైన డైరెక్టర్, ఒక పాలకవర్గ సభ్యుడు మరియు సి.ఇ.ఒ తో కలిపి ఒక కమిటీని గోదాము నిర్మాణమునకు గల అవకాశములను నిర్ధారించడానికి ఏర్పాటు చేసినది. కమిటీ జిల్లా కేంద్ర స్థానము నందలి రాష్ట్ర గోదాము కార్పొరేషన్ సందర్శించి గోదాము మేనేజర్ మరియు ఇంజనీర్‌తో చర్చించినది. విజయనగర్ ఊరు బయట వున్న ప్రైవేటు గోదామును సందర్శించి అక్కడి నిర్వాహకులను కలిసినది. వారు ఇతర నిపుణులైన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి, బ్యాంకు మేనేజర్‌లను కుడా కలిసినారు.

## 5.2. గోదాము వ్యాపారం కీలక అంశములు

పై వివరణతో గోదాముపై దిగువ అంశములపై జై కిసాన్ రైతుఉత్పత్తిదారుల సంస్థ ఏమి చెయ్యాలో చర్చించి రాద్దాము.

*1. రైతు ఉత్పత్తిదారుల సంస్థ సొంత గోదామును కలిగి వుండాలా లేదా వేరే గోదామును ఉపయోగించుకోవాలా ?*

---

*2. గోదాము ఏ ప్రాంతములోవుండాలి?*

---

*3. గోదాము నిల్వ సామర్థ్యం ఎంత వుండాలి?*

---

*4. గోదాము ఒక ఉపయోగం కొరకు వాడలా లేదా బహుళ ఉపయోగం కొరకు ఉపయోగాలా ?*

---

*5. గోదాము వ్యయ కేంద్రమా లేదా ఆదాయము వచ్చే మార్గమా ?*

---

ఫెడరేషన్ కమిటీ సభ్యులు గోదాము వ్యాపారమును మరింత లోతుగా చూశారు. వారు సమర్ధవంతమైన ప్రణాళిక మరియు దాని అమలుకు భిన్నమైన అంశములలో జాగ్రత్త వహించవలెనని తెలుసుకున్నారు. పైన పేర్కొన్న భిన్నమైన ప్రశ్నలను, గోదాము వ్యాపారంలోని కొన్ని ముఖ్యమైన అంశములను గుర్తించదానికి ప్రయత్నించారు.

## పట్టిక 1 : గోదాము వ్యాపారములోని కీలక అంశములు

| | | |
|---|---|---|
| **1.** | **రైతు ఉత్పత్తిదారుల సంస్థ సొంత గోదామును కలిగి వుండాలా లేదా వేరే గోదామును ఆశ్రయించాలా?** | పైన చెప్పిన ప్రకారం రైతు ఉత్పత్తిదారుల సంస్థ సమీపములో ఎటువంటి గోదాము సదుపాయములు అందుబాటులో లేవు. ఒకవేళ కొన్ని అందుబాటులో ఉన్నప్పటికీ, రైతు ఉత్పత్తిదారుల సంస్థ వ్యాపారం ఆటంక పడకుండా సమయానికి అందుబాటులో స్థిరముగా లభించుట లేదు. కనుక ఈ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆ ప్రాంతములోని రైతులు పంట కోత కాగానే తమ ఉత్పత్తులను తక్కువ ధర అయినప్పటికీ అమ్ము కుంటున్నారు. కనుక జై కిసాన్ ఫెడరేషన్ సాధ్యాసాధ్యాలు ఉన్నందున తన సొంత గోదామును కలిగి వుండాలని అలోచించినది. |
| **2.** | **గోదాము ఏ ప్రదేశంలో వుండాలి?** | జై కిసాన్ ఫెడరేషన్ తన గోదాము ప్రాంతమును సిరిపూర్ కు సమీపములో నిర్ణయించినది. ఎందుకంటే అది అందరి రైతు ఉత్పత్తిదారుల సంస్థల సభ్యులకు మధ్య ప్రదేశం. చాలామటుకు సేకరణ ఈ ప్రాంతమునకు సమీపములో జరుగును. సిరిపూర్ ప్రధాన రహదారికి కలుపబడి వున్నది. మార్కెట్‌కు చేరుటకు మంచి రవాణా సదుపాయములు కలవు. |
| **3.** | **గోదాము నిల్వ సామర్థ్యం ఎంత వుండాలి?** | పైన నిల్వ పరిమాణం పట్టికలో చూపిన విధముగా, ఏ సమయములో నైనా 1000 టన్నుల సరుకు నిల్వ చేయబడాలి. కనుక 1000 టన్నులు గోదాము నిల్వ సామర్థ్యం 1000 టన్నులు ఉండాలి. ఒకవేళ ఎక్కువ |

| | | |
|---|---|---|
| | | సరుకు వచ్చినా 1000 టన్నులతో ప్రారంభించి, తరువాత ఎక్కువ గోదాము సామర్థ్యమును పెంచుకొనవచ్చును. ఇటువంటి ప్రాంతములలో 1000 టన్నుల గోదాము మార్కెట్‌లో కనిష్టము, లాభదాయకతను కలిగిన సామర్థ్యం అగును. |
| **4.** | *గోదాము ఒక్క ఉపయోగమునకు వాడాలా లేదా బహుళ ఉపయోగామునకా?* | పైన తెలియజేసిన ప్రకారం గోదాము బహుళ ప్రయోజనమునకు అంటే రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యక్రమములైన సేకరణ & మార్కెటింగ్, సంసాధన చేసిన ఉత్పత్తులను నిల్వ చేయుటకు మరియు విత్తనములు మరియు ఇతర ఉత్పత్తి అవసరముల కొరకు వాడవలెను. రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యక్రమములకే కాక ఎఫ్.పి.ఓ పని చేసే ప్రాంతములోని వ్యక్తిగత రైతులకు మరియు ఇతర ఏజెన్సీలకు అద్దె ఇచ్చుటకు చాలా డిమాండ్ వున్నది. ఇటువంటి బహుళ ఉపయోగం గరిష్ట మరియు పూర్తి కాలం వినియోగం వలన గోదాము మరింత లాభదాయకమగును. |
| **5.** | *గోదాము వ్యయ కేంద్రమేనా లేదా ఆదాయ వనరు కూడానా?* | గోదాము రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యక్రమములకే కాక వ్యక్తిగత రైతులకు మరియు ఇతర ఏజెన్సీలకు అద్దె పై ఇవ్వవచ్చును. ఇది రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అదాయమును సంపాదించును. కనుక గోదాము ఫెడరేషన్‌కు ఆదాయ వనరు కూడా. |

## 5.3. గోదాము వ్యాపార ప్రణాళిక సారాంశం

ప్రారంభ అధ్యయన మరియు సంప్రదింపులు అయిన తరువాత జైకిసాన్ ఫెడరేషన్ సిఇఒ మరియు నిపుణుడైన డైరెక్టర్ గోదాము కొరకు వ్యాపార ప్రణాళికను తయారుచేశారు. వివరణాత్మకమైన వ్యాపార ప్రణాళిక ఉప సంఘములో చర్చించిన తరువాత దిగువ సారాంశం తయారు చేయబడినది.

### పట్టిక 2. గోదాము వ్యాపార ప్రణాళిక సారాంశం (లక్షలలో)

| వ.స. | వ్యయం | సం.0 | సం.1 | సం.2 | సం.3 | సం.4 | సం.5 |
|---|---|---|---|---|---|---|---|
| | మూలధన వ్యయం | | | | | | |
| 1 | భూమి | 5.00 | | | | | |
| 2 | భవనం | 119.00 | | | | | |
| 3 | ఫర్నిచర్ ఫిట్టింగ్స్ | 1.00 | | | | | |
| 4 | ప్లాంట్ & మిషినరీ | 3.00 | | | | | |
| 5 | ముందుగా అయ్యే ఖర్చులు | 2.00 | | | | | |
| | మొత్తం | 130.00 | | | | | |
| 6 | కార్యనిర్వహణ వ్యయం | | 24.68 | 25.17 | 25.75 | 25.03 | 24.41 |
| 7 | స్థూల ఆదాయం | | 31.50 | 33.08 | 34.73 | 36.47 | 38.29 |
| 8 | నికర ఆదాయం | | 6.82 | 7.91 | 8.97 | 11.44 | 13.88 |

వ్యాపార ప్రణాళిక లాభదాయకతను సూచిస్తున్నది. మూలధన వ్యయం మరియు కార్యనిర్వహణ వ్యయం వివరములు అనుబంధం 4 లో ఇవ్వబడినవి.

## 5.4. గోదాం కొరకు అవసరమైన అనుసంధానములు

జైకిసాన్ రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్ స్వతంత్ర డైరెక్టర్ గోదాం సేవలు / అందించుట నియంత్రించుట తెలియజేసారు. దేశములో భిన్నమైన ఏజెన్సీలు పని చేస్తాయని తెలియజేసారు. ఫెడరేషన్ ఇటువంటి అనుసంధానములను తమ గోదాముకు అవసరమైన మద్దతు కొరకు సమయానుసారం ఉపయోగించుకొనవచ్చును. అవి దిగువ పట్టికలో ఇవ్వబడినవి.

**పట్టిక 3 గోదాముకు అనుసంధానములు**

| వ.స. | అధారిటీ / ఏజెన్సీ | అవసరం |
|---|---|---|
| 1. | గోదాం (అభివృద్ధి మరియు నియంత్రణ) చట్టం 2007 | దేశం లోని గోదాములను నియంత్రిస్తాయి. |
| 2. | గోదాము అభివృద్ధి నియంత్రణ అధారిటి డబ్లూడిఆర్ఎ ఆహార మరియు ప్రజా పంపిణి వినియోగదారుల, ఆహార ప్రజా పంపిణి మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం) WDRA Warehousing Development & Regulatory Authority | గోదాము (నియంత్రణ మరియు అభివృద్ధి) చట్టం 2007 నిబంధనల నియంత్రణ మరియు అమలు గోదాము రిజిస్ట్రేషన్ మరియు గుర్తింపు: శిక్షణ |
| 3. | రాష్ట్ర ప్రభుత్వముల సివిల్ సరఫరా కార్పొరేషన్ | ఆహార ధాన్యముల నిల్వ లైసెన్స్ & నియంత్రణ |
| 4. | వ్యవసాయ ఉత్పత్తి (గ్రేడింగ్ మరియు మార్కెటింగ్) చట్టం, 1937 (1986లో సవరించబడినది) అగ్ మార్క్ సంచాలకులు మార్కెటింగ్ మరియు తనిఖీ (డిఐఎం) వ్యవసాయ మరియు సహకార శాఖ భారత ప్రభుత్వంకు అనుబంధ కార్యాలయం. | వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యత గ్రేడ్స్ & ప్రమాణములు |

| | | |
|---|---|---|
| | | |
| 5. | గుర్తింపు ఏజెన్సీ<br>కేంద్ర గోదాము కార్పొరేషన్ (సిడబ్లూసి) ప్రభుత్వ రంగ సంస్థ, వినిమయదారుల, ఆహార & ప్రజా పంపిణి మంత్రిత్వ శాఖ<br>రాష్ట్ర గోదాము కార్పొరేషన్ (ఎస్‌బ్లూసిలు) ; సిడబ్ల్యుసి అనుబంధం | గుర్తింపు |
| 6. | స్పాట్ ఎక్స్చేంజి ఎలక్ట్రానిక్ గోదాము రశీదు జారీ మరియు శిక్షణ | గోదాము ఎంపానల్మెంట్ : రైతు ఉత్పత్తి దారుల సంస్థ వర్తకములో పాల్గొనవచ్చు. |

**ముందడుగు**

గోదాము సానుకూలత మరియు ప్రయోజనములతో ఆకర్షించబడి, జైకిసాన్ ఫెడరేషన్ పాలకవర్గం గుర్తింపు పొందిన స్థలమును లీజుకు తీసుకొని గోదాము కొరకు అవసరమైన అనుమతులు స్థానిక పంచాయతి స్థాయిలో తీసుకొనుటకు ఉత్సాహము చూపటము జరిగినది. గోదాముకు అవసరమైన నిధులను సేకరించుటకు వివరణాత్మక ప్రతిపాదన నివేదికను తయారుచేయుటకు నిపుణులైన ఏజెన్సీని సూచించమని వికాస ఎన్జీఓను కోరినది.


పైన పేర్కొన్న పప్పు మిల్లు మరియు గోదాము ఉదాహరణల నుండి నేర్చుకున్న అంశముల నుండి  పాలకవర్గ సభ్యులుగా మన రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు దిగువ విషయములు నిర్ధారణ చేయాలి.

- మన ఉత్పత్తులకు అవసరమైన విలువ జోడింపు కార్యక్రమమును రూపం మరియు సమయం గుర్తించాలి.
- మూలధన ఖర్చు, కార్యనిర్వహణ ఖర్చు, వ్యాపారమునకు కావలసిన ఉత్పత్తి, మిల్లు / గోదాము సామర్థ్య వినియోగం, అనుసంధానాలు, ఆదాయము మరియు వ్యయముతో  వివరణాత్మకమైన వ్యాపారము నమూనా పొందాలి.

# 6

# ఉత్పత్తుల పంపిణి స్థలముతో విలువ జోడింపు

## ఉద్దేశ్యములు




*ద్వితీయ సంసాధన (ఆధునిక) ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపు గ్రహించుట*

*విలువ జోడింపు రకములు మరియు రైతు ఉత్పత్తిదారుల సంస్థ భిన్న స్థాయిలలో విలువ జోడింపు గురించి తెలిసికొనుట*


***విషయాంశములు :***

1. ఉత్పత్తుల పంపిణీలో కీలక అంశములు
2. పంపిణీ మాధ్యమాలు
3. ఎక్కువ ఆదాయము పొందడానికి కీలక అంశములు
4. ఉత్పత్తి పంపిణికి రవాణా వాహనం




గత పాఠములో మనం గోదాము నిల్వలో మార్కెటింగ్ విధానము గురించి తెలిసికున్నాము. ఉత్పత్తి పంపిణీ అనేది మార్కెటింగ్‌లో మరొక ముఖ్యమైన విధి. ఈ పాఠములో కొనుగోలుదారులు / వినియోగదారులకు ఉత్పత్తి పంపిణీ అంశమును పరిశీలిద్దాము. ఉత్పత్తుల సేకరణ, సంసాధన, నిల్వ మొదలగునవి చూసిన తరువాత మన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఇప్పుడు ఉత్పత్తులతో సిద్ధమైనది. కనుక ఇప్పుడు మనం ఉత్పత్తులు కొనుగులుదారులకు పంపిణి / సరఫరా అయ్యేలా చూడాలి.

పంపిణి / సరఫరా అంటే ఉత్పత్తిని కొనుగోలుదారుకు / వినియోగదారుకు సకాలములో, ఎప్పుడూ ఒకేవిధముగా చేర్చుట. ఉత్పత్తి పంపిణీలో కొన్ని విజయవంతమైన కథలు లిజ్జత్ పాపడ్ (అన్ని డిపార్ట్‌మెంటల్ స్టోర్స్‌లో లభ్యమగును) మరియు అమూల్ పాలను (అన్ని ప్రాంతములలో లభించును) చెప్పవచ్చు.





## 6.1. ఉత్పత్తి పంపిణి సరఫరా కీలక అంశములు

ఉత్పతుల సరఫరాలో ఎదుర్కోవలసిన నాలుగు ముఖ్యమైన అంశములు.



ఎక్కడకు సరఫరా చేయాలి ?



ఎప్పుడు సరఫరా చేయాలి ?



ఎంత సరఫరా చేయాలి ?




ఎలా సరఫరా చేయాలి (రవాణా పద్ధతి)

చిత్రం 7 : ఉత్పత్తుల సరఫరాలోని కీలక అంశములు

పైన తెలియజేసిన ప్రకారం ఎక్కడ సరఫరా చెయ్యాలి ? అంటే ఉత్పత్తిని అందజేయవలసిన ప్రదేశం, ఎప్పుడు సరఫరా అంటే ఉత్పత్తి అందజేయవలసిన సమయం, ఎంత సరఫరా, ఎంత సరుకు అంటే ఎలా సరఫరా, రవాణా పద్దతి ఏమిటి అనే నాలుగు ముఖ్యమైన అంశములు ఉత్పత్తి పంపిణిలో ఉంటాయి. ఉత్పత్తుల పంపిణికి ఇవి ప్రాధమిక అవసరములు. ఈ అంశములని స్పష్టముగా కొనుగోలుదారులతో బేరమాడాలి అప్పుడే పరస్పర అంగీకారం కుదురును.

## 6.2. పంపిణి మార్గం

ఏ ఉత్పత్తి అయిన చివరగా వినియోగదారును చేరాలంటే, పనులు నిర్వహించే, వివిధ పంపిణీ మార్గాలు అవసరం. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఉత్పత్తులను తన వినియోగదారులకు చేర్చడానికి సమర్ధవంతమైన సరైన పంపిణి మార్గం వుండాలి.









గత అధ్యాయములో తెలిపిన విధముగా, క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థ కూరగాయలను కార్పొరేట్ చిల్లర వర్తకులకు సరఫరా చేయుచున్నది. ఈ చిల్లర కొనుగోలుదారు తన దుకాణముల ద్వారా నేరుగా వినియోగదారులకు సరఫరా చేయుచున్నారు.

అయితే ఇతర ఉత్పత్తులు వేరుసెనగ మరియు చిరు ధాన్యములను రైతు ఉత్పత్తిదారుల సంస్థ టోకు వ్యాపారులు మరియు సంసాధనాదారుకు సరఫరా చేస్తే, సంసాధకులు తరువాత చిల్లర వర్తకునకు చివరగా వినియోగదారులకు చేరవేస్తారు.

**పంపిణి వ్యవస్థను ఎంపిక చేసుకోనడములో కీలక అంశములు.**

అవసరమైన పంపిణి వ్యవస్థను రెండు అంశములను దృష్టిలో ఉంచుకొని ఎంపిక చేయవచ్చును. అవి ఉత్పత్తి మరియు వ్యయం.

**ఉత్పత్తి**

ముడి ఉత్పత్తులైన వేరుశనగ గుండ్లు, మొక్కజొన్న, ధాన్యములు, కూరగాయలు మొదలగువాటిని ఉదాహరణగా తీసుకుందాము. వాటిని ప్రాథమిక రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్థాయిలో సేకరిస్తుంది. ఇటువంటి ముడి సరుకులను రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఒక రవాణా వాహనములో కొనుగోలుదారుకు సరఫరాచేయవచ్చు. అలాగే కొనుగోలు చేసే పరిమాణం అధికముగా వున్నప్పుడు రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యాలయము వద్ద నుండి నేరుగా కొనుగోలుదారు తీసుకొనవచ్చును.

ఇప్పుడు సంసాధన చేసిన ఉత్పత్తులు అయిన పప్పులు, వంట నూనె, ప్యాక్ చేయబడిన పండ్లు, బియ్యం, పిండి మొదలగునవి. ఫెడరేషన్ స్థాయిలో నిర్వహించబడుతుంది. ఇవి వినియోగదారులచే ఉ పయోగించబడి తినడానికి లేదా వండటానికి సిద్ధముగా వున్నవి. అయినప్పటికీ రైతు ఉత్పత్తిదార్ల సంస్థ వాటిని నేరుగా వినియోగదారునికి (వారు దూర ప్రాంతములలో ఉండవచ్చును) చేర్చడానికి వ్యయం కావచ్చును. ఇటువంటి పంపిణీ చేయడానికి కొన్ని మార్గములు అవసరం.

**వ్యయం**

ఉత్పత్తి రకమే కాక పంపిణిమార్గమును ఎన్నుకొవడములో పరిగణన లోనికి తీసుకోవలసిన మరో ముఖ్యమైన అంశం వ్యయం. సహజముగా పంపిణి మార్గం వ్యయంతో కూడుకుని వుంటుంది. అయితే వ్యయం, పంపిణీ నుంచి పొందే విలువ కంటే మించరాదు. ఉదాహరణకు క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఒక టన్ను కూరగాయలను నేరుగా వినియోగదారులకు సరఫరా చేయదలచినది. విలువ రు.20000 (చిల్లర వర్తకుని ద్వారా సరఫరా చేసినచో) నుంచి రూ.30000కు పెరుగును. చిల్లర వర్తకుని మార్జిన్

కూడా పొందవచ్చును. అయినప్పటికీ అదనపు వ్యయం (చిన్న పాక్స్, రవాణా, భిన్నమైన దుకాణములకు పంపిణి చేయుట, మార్కెటింగ్ ఏజెంట్స్, ప్రకటనలు మొదలగునవి. నేరుగా వినియోగదారులకు సరఫరా చేయడము వలన అదనపు ప్రయోజనం రూ. 10,000ను మించినట్లయితే అది అనుకూలం కాదు.


**పంపిణీదారులతో సంబంధములు**

పంపిణీ మార్గం ఏది అయినప్పటికీ ఒక ముఖ్యమైన అంశం సమర్ధమైన పంపిణీదారులతో, భాగస్వామ్య సంబంధములు, పంపిణీ భాగస్వాములు ముఖ్యముగా రవాణాదారులు, సరఫరాదారులు, సంసాధకులు, టోకు వర్తకులు, చిల్లర వర్తకులు, ఎఫ్.పి.ఓ సంబంధిత చానల్ భాగస్వాములతో దీర్ఘకాలం సంబంధము కలిగివుండాలి. దీనిని పాలకవర్గం మరియు సిబ్బంది కొనసాగించుటకు కృషి చెయ్యాలి.

**ఎక్కువ విలువ పొందటానికి కీలక అంశములు**

పంపిణీ చానల్‌తో, వినియోగదారులతో మరింత దగ్గర కావాలంటే ఎఫ్.పి.ఓ విలువల గొలుసుపై మరింత పట్టు మరియు నియంత్రణను సాధించుట, దిగువ కీలక అంశములను అనుసరించుట రైతు ఉత్పత్తిదారుల సంస్థకు అవసరం.

**చిత్రం 9 : విలువ పొందటానికి కీలక అంశములు**



పైన తెలిపిన విధముగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలు వినియోగదారులు వండటానికి / తినడానికి సిద్దముగా వుండే ఉత్పత్తులకు అవకాశములను వెదకాలి. ప్యాకింగ్, బ్రాండింగ్ మరియు సమర్ధవంతమైన పంపిణీతో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఉత్పత్తుల విలువలో ఎక్కువ భాగమును పొందగలుగుతుంది.

## 6.3. రవాణా వాహనం




ఉత్పత్తుల పంపిణీకి అతి ముఖ్యమైన అవసరం ఏమిటి అంటే అది ఖచ్చితముగా రవాణా వాహనం మరియు దాని సమర్ధవంతముగా వినియోగించటము. ఇప్పుడు క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థ తన వ్యాపార కార్యక్రమములకు తన రవాణా వాహనమును ఏవిధముగా వినియోగిస్తున్నది చూద్దాము.

క్రిషి రైతు ఉత్పత్తిదారుల సంస్థకు, కొనుగోలుదారులకు ఉత్పత్తుల సరఫరా, వ్యవసాయ ఉత్పత్తి అవసరముల నిల్వలను కలిగి వుండటం వంటి కార్యక్రమములు చాలా తరచుగా జరుగుతాయి. కిరాయి వాహనము సమయానికి లభ్యం కాకపోవడం మరియు అధిక వ్యయం వలన వారి సేకరణ మరియు సరఫరాలకు ఆటంకం ఏర్పడుతున్నది. దీన్ని దృష్టిలో పెట్టుకొని తన కార్యక్రమములపై నియంత్రణకు సొంత వాహనం కలిగి వుండాలని నిర్ణయం తీసుకున్నది. వారు 6 టన్నుల మినీ వాహనమును

రూ.14 లక్షలకు కొనుగోలు చేశారు. ఈ 14 లక్షలలో రూ.7 లక్షలు ఉద్యాన విభాగము నుండి గ్రాంట్‌గా పొందారు. మిగిలిన రూ. 7 లక్షలను బ్యాంకు నుండి ఋణముగా పొందారు. వాహనమును ఒక సంవత్సరం క్రితం కొన్నప్పటినుండి పూర్తి వినియోగంలో వున్నది. నెలకు 25 రోజులు రోజుకు సగటున 100 కిలో మీటర్లు. కొన్ని రోజులు రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యక్రమములకు అవసరం లేనప్పుడు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఇతరులకు అద్దెపై ఇచ్చి పూర్తి వినియోగమును సాధించినది.

వాహనం లోడ్ విషయములో రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏ సమయములోనైనా 5 టన్నులకు తగ్గకుండా చర్యలు తీసుకుంటున్నది. వాహనమును ఉపయోగములో ఉంచుటకు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ వాహనమును బహుళ వ్యాపారములకు సేకరణ, మార్కెటింగ్, ఉత్పత్తి అవసరముల సరఫరా మొదలగువాటికి వాడుతున్నది. అనుభవం కలిగిన చురుకైన స్థానిక యువకులను వాహనం నడపడానికి మరియు నిర్వహణకు తీసుకున్నది. రైతు ఉత్పత్తిదారుల సంస్థ స్పష్టమైన నిబంధనలను మరియు ప్రోత్సాహకములను ఏర్పాటు చేసినది. వాహనము యొక్క గత సంవత్సరం ఖర్చు మరియు ఆదాయ వివరములు దిగువ ఇవ్వబడినవి.

**పట్టిక 4 : రవాణా వాహనం ఆదాయం మరియు ఖర్చు**

| పెట్టుబడి | | |
|---|---|---|
| 1. | వాహనం ధర (ఉపకరణములు మరియు రిజిస్ట్రేషన్‌తో సహా) | 14,00,000 |

**నిర్వహణా ఖర్చులు (రూ. సంవత్సరమునకు)**

| వ.స. | వివరం | యూనిట్ | యూనిట్ వ్యయం | వ్యయం(రూ./సం) |
|---|---|---|---|---|
| 1 | జీతం | రూ./నెలకు | 10,000 | 1,20,000 |
| 2 | ప్రోత్సాహకాలు | రూ./నెలకు | 2,000 | 24,000 |
| 3 | మరమత్తులు, నిర్వహణ & భీమా | రూ.సం | 21,000 | 21,000 |
| 4 | అప్పు వాయిదా (అసలు+వడ్డీ) | రూ./నెలకు | 17,500 | 2,10,000 |
| 5 | డీజిల్ | రూ/లీటర్ | 60 | 2,25,000 |
| | **మొత్తం** | | | **6,00,000 (బి)** |

| వ.స. | వివరం | యూనిట్ | యూనిట్ వ్యయం | వ్యయం(రూ./సం) |
|---|---|---|---|---|
| | | | | |
| | ఆదాయం | | | |
| 1. | పని చేసిన రోజుల సంఖ్య | | | 300 |
| 2. | రోజుకు కిరాయి విలువ | | | 2,100 |
| 3. | స్థూల ఆదాయం | | | 6,30,000 (ఎ) |
| | **నికర ఆదాయం** | | | **30,000 (ఎ-బి)** |

అద్దె మాత్రమే ఆదాయముగా పరిగణించబడును. రైతు ఉత్పత్తిదారుల సంస్థ అన్ని ఖర్చులను భరించి వాహనం యొక్క బ్యాంకు నెలవారీ అప్పు వాయిదాలను ఆదాయము నుండి చెల్లించగలుగుతున్నదని పై పట్టిక చూపిస్తున్నది.

**అభ్యాసం:**

పైన ఇవ్వబడిన పంపిణి విధానములో వివిధ అంశములు దృష్టిలో వుంచుకుని మన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఉత్పత్తులకు సరిపడే పంపిణి వ్యవస్థను నిర్ణయించండి.

పై చర్చ ఆధారముగా పాలకవర్గ సభ్యులైన మనం దిగువ విధంగా ఆలోచించాలి. ఉత్పత్తుల పంపిణీని అవసరమైన పరిమాణములో సరైన సమయంలో సరైన స్థలంలో జరిగేలా చూడాలి.

- *మన ఎఫ్.పి.ఓ ఉత్పత్తులకు తగిన పంపిణీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి.*
- *రవాణా వాహనమును సమర్ధవంతంగా వినియోగించడానికి ప్రణాళిక చేసి అమలు చేయాలి.*

# అనుబంధం 1 : పప్పు మిల్లు సాధ్యాసాధ్యాలు

జైకిసాన్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ యొక్క ఉప-కమిటీ పప్పు మిల్లు సాధ్యాసాధ్యాలను చూసినది. వారు ముడిసరుకు లభ్యత, సామర్థ్య వినియోగం, స్థలం, రవాణా, సంసాధనకు ఇతర వినియోగదారుల నుండి వచ్చే డిమాండ్, ఇతర పప్పు మిల్లులు మొదలగు వివరములు 2019-2023 వరకు గల 5 సంవత్సరముల కొరకు రుపొందించటము జరిగినది.

**ముడి సరుకు లభ్యత**

పప్పు ధాన్యముల ఉత్పత్తి మరియు ముడి సరుకు లభ్యత అంచనాలు దిగువ ఇవ్వబడినవి.

**పట్టిక 5 : పప్పు మిల్లుకు ముడి ఉత్పత్తుల లభ్యత**

| వ.స. | వివరం | యూనిట్ | 2023 |
|---|---|---|---|
| | **ఉత్పత్తి రూపం** | | |
| 1. | పప్పు ధాన్యములను సరఫరా చేసే క్రియాశీల సభ్యులు | సంఖ్య | 1,800 |
| 2. | చిరుధాన్యముల ఫెడరేషన్‌కు సరఫరా చేసే సభ్యులు | | |
| | (ప్రతి సభ్యుడిచే పప్పు ధాన్యముల ఉత్పత్తి 10 క్వింటాల్) | క్వింటాల్స్ | 18,000 |
| 3. | ఇతరులచే పప్పు ధాన్యముల సరఫరా సంసాధనకు | క్వింటాల్స్ | 1,200 |
| 4. | మొత్తం పప్పు ధాన్యములు సంసాధన కొరకు ఫెడరేషన్‌కు సరఫరా చేసినది. | క్వింటాల్స్ | 19,200 |

ఫెడరేషన్‌కు వచ్చే పప్పు ధాన్యముల పరిమాణమును తక్కువ స్థాయిలో గణించడం జరిగినది. తన సభ్య రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పని చేసే ప్రాంతములో ఎక్కువమంది సభ్యులు పప్పు ధాన్యములను పండిస్తున్నందున ఎక్కువ ఉత్పత్తి వున్నది. నిజానికి సభ్యరైతు ఉత్పత్తిదారుల సంస్థ సమిష్టి మార్కెటింగ్‌ను దృష్టిలో పెట్టుకొని ఫెడరేషన్ పప్పు మిల్లుకు లభించే ముడిసరుకును లెక్కించడం జరిగినది. గత 10 సంవత్సరములుగా రాజాపేటప్రాంతం సాంప్రదాయకముగా పప్పుధాన్యాలకు ప్రసిద్ది. అదే ధోరణి భవిష్యత్‌లో

కూడా కొనసాగే అవకాశం వుంది. స్థానికంగా పండే పంట నాణ్యతకు, మిల్లు చేసి సరఫరా చేసే పప్పుకు మార్కెట్‌లో ప్రాముఖ్యమిస్తారు. కనుక ఈ పప్పుకు మార్కెట్‌లో భౌగోళికంగా గుర్తింపు వున్నది.

పప్పు ధాన్యముల ఆ ప్రాంతంలో చాలా విస్తృతంగా వున్నది. అవసరమైన ముడిసరుకు రాజాపేటకు 15 కిలోమీటర్లలో లభ్యమగును. కనుక ఇది రవాణా వ్యయం మరియు ఇతర ఖర్చులను తగ్గించును. ఈ ప్రాంతములో పప్పు ధాన్యముల సంసాధనకు సభ్యేతరుల నుండి చాలా డిమాండ్ వున్నది. అయితే ఈ డిమాండును అధ్యయనములో తక్కువ స్థాయిలోనే తీసుకొనబడినది.

**సామర్ధ్య వినియోగం**

పప్పు మిల్లు సామర్ధ్య వినియోగ వివరములు దిగువ పట్టికలో ఇవ్వబడినవి.

**పట్టిక 6 : పప్పు మిల్లు సామర్ధ్య వినియోగం**

| వ.స. | వివరం | యూనిట్ | 2023 |
|---|---|---|---|
| | **ఉత్పత్తి రూపం** | | |
| 1. | ప్రతి రోజు సామర్ధ్యం (గంటకు 20 క్వింటాల్, రోజుకు 6 గంటలు) | క్వింటాల్ | 120 |
| 2. | సంవత్సరం లో పని రోజులు (8 నెలలు పని చేస్తుంది, నెలకు 20 రోజులు) | రోజులు | 160 |
| 3. | మొత్తం సామర్ధ్యం సంవత్సరమునకు | క్వింటాల్ | 19,200 |
| 4. | సామర్ధ్య వినియోగం | శాతం | 100% |

దాల్ మిల్లు సామర్ధ్యం గంటకు 20క్వింటాల్ లేదా 2 టన్నులు (టన్నులు గంటకు) ఇది పప్పు మిల్లుకు పరిశ్రమలో వున్న సాధారణ ఆర్థిక సామర్ధ్యమును బట్టి నిర్ణయించడం జరిగినది. సమాచారం ప్రకారం పప్పు మిల్లుని పూర్తి సామర్ధ్యమునకు ఉపయోగించవచ్చు. రాజాపేటలో రెండు పప్పు మిల్లులు గంటకు 2.5 టన్నుల సామర్ధ్యం కలవి వున్నాయి. అవి పాతబడినందున సమర్ధవంతముగా పని చేయడం లేదు. కనుక ప్రస్తుతం వున్న పప్పు మిల్లులు ఈ ప్రాంత అవసరములను తీర్చలేకపోవుచున్నవి.

# అనుబంధం 2 : పప్పు మిల్లు వ్యాపార వివరములు

| జైకిసాన్ ఎఫ్.పి.ఓ ఫెడరేషన్ ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ పప్పు ధాన్యముల సంసాధన యూనిట్ (పప్పుమిల్లు) | | |
|---|---|---|
| 1. | సామర్థ్యం | గంటకు 2 టన్నులు |
| 2. | ప్రాంతం | రాజాపేట,విజయనగర్ జిల్లా |
| 3. | వ్యాపారములో పాల్గొన్న సభ్యుల సంఖ్య | 3,000 |
| 4. | ప్రధాన పంటలు | కందులు, శనగలు, పెసలు |
| 5. | యోజన బడ్జెట్ | రూ. 146.88 లక్షలు మూలధన వ్యయం కొరకు |

**ఉత్పత్తి వివరములు**

**పట్టిక 7 : పప్పు మిల్లు ఉత్పత్తి వివరములు**

| వ.స. | వివరం | యూనిట్ | 2023 |
|---|---|---|---|
| 1. | గ్రేడ్ వారిగా ఉత్పత్తి శాతం | | |
| 1.1 | పప్పు గ్రేడ్ –ఎ | % | 35% |
| 1.2 | పప్పు గ్రేడ్ –బి | % | 40% |
| 1.3 | విరిగిన పప్పు | % | 15% |
| 1.4 | పొట్టు (Husk) | % | 7% |
| 1.5 | పొడి | % | 3% |

| వ.స. | వివరం | యూనిట్ | 2023 |
|---|---|---|---|
| 2. | గ్రేడ్ వారిగా ఉత్పత్తుల దిగుబడి | | |
| 2.1 | పప్పు-గ్రేడ్-ఎ | క్వింటాల్ | 6,720 |
| 2.2 | పప్పు గ్రేడ్-బి | క్వింటాల్ | 7,680 |
| 2.3 | విరిగిన పప్పు | క్వింటాల్ | 2,880 |
| 2.4 | పొట్టు (Husk) | క్వింటాల్ | 1,344 |
| 2.5 | పొడి | క్వింటాల్ | 576 |

పై పట్టికలో భిన్నమైన నాణ్యత గల పప్పు మరియు పొట్టు, పొడి అనే ఉప ఉత్పత్తులు కూడి వున్నాయి. ఉత్పత్తుల దిగుబడి మార్కెట్ మరియు సంసాధన అనుభవం ద్వారా అంచనాలు వేయుట జరిగినది. భిన్నమైన ఉత్పత్తుల నిష్పత్తి వివిధ కారణముల మీద ఆధారపడి ఉండును. అవి ముడిసరుకు నాణ్యత, రకం, వాతావరణం, విద్యుచ్ఛక్తి మరియు ప్లాంట్ ఆపరేటర్ నైపుణ్యంపై ఆధారపడి ఉండును. సంసాధనలో అవసరమైన నాణ్యతా ఉత్పత్తులు ప్రణాళిక నిష్పత్తి ప్రకారం పొందుట లాభదాయకం. దీనికొరకు నాణ్యమైన ముడిసరుకు మరియు సమర్ధవంతమైన సంసాధన క్రియలు అవసరం.

చిల్లర వర్తకులకు చేరుకోవడానికి, పప్పు 5 కేజీలు, 10 కేజీలు, 15 కేజీలు, మరియు 25 కేజీల సంచులలో ప్యాక్ చేయబడును. నాణ్యమైన ఉత్పత్తులకు నిర్దిష్ట భారత ఆహార కోడ్, ఆహార సంరక్షణ మరియు భారత ప్రమాణముల అధారిటీ (ఎఫ్ఎస్ఎస్ఎఐ) సర్టిఫికేట్ ద్వారా భరోసా ఇవ్వబడును.

## పట్టిక 8 : కందులకు ఎఫ్ఎస్ఎస్ఎఐ నాణ్యతా గ్రేడ్స్

| క్ర.స. | వివరం | పరిమితి | |
|---|---|---|---|
| 1. | తేమ | 14 శాతం బరువు ప్రకారం |  |
| 2. | ఇతర పదార్ధములు | 1 శాతంబరువు ప్రకారం | |
| 3. | ఇతర తినే గింజలు | 0.5 శాతం బరువు ప్రకారం | |
| 4. | చెడిపోయిన గింజలు | 5 శాతం బరువు ప్రకారం | |
| 5. | పురుగు పట్టిన గింజలు | 3 శాతం లెక్క ద్వారా | |
| 6. | యూరిక్ ఆమ్లం | 100 ఎంజి. కిలోకి | |
| 7. | ఎఫ్లోటాక్సీన్ | 30 మైక్రో గ్రామస్ కిలోకి | |

**ఖర్చు వివరములు**

**మూలధన ఖర్చు**

పప్పు మిల్లు అంచనా మూలధన ఖర్చు క్రింద విధముగా వుంటుంది.

### పట్టిక 9. పప్పు మిల్లు మూలధన ఖర్చు

| క్ర.సంఖ్య. | మూలధన ఖర్చు | 2019 (రూ.లక్షలు) |
|---|---|---|
| 1. | భూమి | 2.50 |
| 2. | భవనం | 42.75 |
| 3. | ప్లాంట్ & మిషినరీ | 93.93 |
| 4. | ఫర్నిచర్ & ఫిట్టింగ్స్ | 4.80 |
| 5. | నిర్వహణా ముందు ఖర్చులు | 2.90 |
| | **మొత్తం** | **146.88** |

పైన తెలిపిన విధముగా సంసాధన యూనిట్స్‌కు సాధారణ పెట్టుబడి అవసరములు భూమి, భవనం, ప్లాంట్ & మిషనరీ, ఫర్నిచర్ & ఫిట్టింగులు మరియు నిర్వహణ ముందు ఖర్చులు, నిర్వహణ ముందు ఖర్చులు చాలామటుకు ఇంజనీరింగ్ డిజైన్ & ప్లాన్, అవసరమైన లైసెన్సులు/అనుమతులు తీసుకొనుట మరియు ప్రారంభ శిక్షణ ఖర్చులు ఉండును. ఆరబెట్టుటకు ప్లాట్ఫారములు, వాహనము అవసరమైన అర ఎకరం భూమికి ప్రణాళిక వేయాలి. మిషనరీ సెమి ఆటోమేటెడ్ ఉండాలి. మాన్యుల్ మిషనరీ ఇప్పుడు పాతది మరియు సమర్థమైనది కాదు. పూర్తిగా ఆటోమేటెడ్ మిషన్ అధిక వ్యయం మరియు లాభదాయకత సాధ్యము కాదు.

**కార్యాచరణ ఖర్చులు**

పప్పు మిల్లు కార్యాచరణ ఖర్చులు దిగువ విధముగా వున్నాయి.

**పట్టిక 10. పప్పు మిల్లు కార్యాచరణ ఖర్చులు (రూ.లక్షలలో)**

| క్ర.సం | వివరములు | 2019 | 2020 | 2021 | 2022 | 2023 |
|---|---|---|---|---|---|---|
| ఎ. | **స్థిర వ్యయం** | | | | | |
| 1. | మానవ వనరులు | 17.16 | 18.88 | 20.76 | 22.84 | 25.12 |
| 2. | నిర్వహణ ఖర్చులు | 3.44 | 3.78 | 4.16 | 4.58 | 5.03 |
| | ఉప–మొత్తం (ఎ) | 20.60 | 22.66 | 24.92 | 27.42 | 30.16 |
| బి. | **అస్థిర వ్యయం** | | | | | |
| 1. | ముడి సరుకు–కందులు | 630.00 | 787.95 | 859.33 | 944.12 | 972.44 |
| 2. | విద్యుచ్ఛక్తి | 4.20 | 5.61 | 6.53 | 7.67 | 8.43 |
| 3. | వంట చెరుకు | 1.75 | 2.34 | 2.72 | 3.19 | 3.51 |
| 4. | వినిమయాలు, విడి భాగాలు మరియు నూనె | 2.77 | 3.70 | 4.31 | 5.06 | 5.57 |
| 5. | కూలీలు | 3.36 | 4.49 | 5.23 | 6.13 | 6.75 |
| 6. | లేబులింగ్&ప్యాకింగ్ | 0.70 | 0.94 | 1.09 | 1.28 | 1.41 |
| 7. | గోనె సంచులు | 9.10 | 12.16 | 14.16 | 16.61 | 18.27 |
| 8. | మార్కెట్ పంపిణీ ఖర్చులు | 1.40 | 1.87 | 2.18 | 2.56 | 2.81 |
| | ఉప–మొత్తం (బి) | 653.28 | 819.05 | 895.55 | 986.61 | 1,019.19 |
| | మొత్తం (ఎంబి) | 673.88 | 841.71 | 920.47 | 1,014.03 | 1,049.35 |

కార్యాచరణ ఖర్చుల్లో , స్థిర వ్యయం (అంటే రోజువారీ సంసాధన కార్యక్రమము వలన మారనివి). మరియు అస్థిర ఖర్చులు (రోజువారీ సంసాధన వలన మారుతూ వుంటాయి) కూడి ఉంటాయి.

పై వివరములలో చూపిన విధముగా నిర్ణిత ఖర్చుల్లో మానవ వనరులు ప్రధాన ఖర్చు కాగా, అస్థిరమైన ఖర్చుల్లో ముడి సరుకు ప్రధాన వ్యయం.

**ఆదాయ వివరములు**

వివిధ ఉత్పత్తుల ధరలను మార్కెట్ ప్రకారం సాంప్రదాయ స్థాయిలో తీసుకొనడం జరిగినది. అదేవిధముగా అంచనా ఆదాయం, పై పట్టికలో ఇవ్వడం జరిగినది. ఇక్కడ గమనించవలసినది ఈ ఆదాయమే కాకుండా సభ్యుతేతరుల ఉత్పత్తుల సంసాధనపై ఆదాయం కూడా ఉండును.

సంసాధన వలన కొన్ని లాభాలను (రూ.200 క్వింటాల్ కు) సభ్యుల మధ్య వ్యవహార బోనస్ లాగా పంపిణీ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

### పట్టిక 11 – పప్పు మిల్లు ఆదాయ వివరములు

| క్ర.స | వివరం | యూనిట్ | 2019 | 2020 | 2021 | 2022 | 2023 |
|---|---|---|---|---|---|---|---|
| **1. అమ్మకపు ధర అంచనా** | | | | | | | |
| 1.1 | పప్పు– గ్రేడ్ ఎ | రూ./క్వింటాల్ | 6,500 | 6,825 | 7,166 | 7,525 | 7,901 |
| 1.2 | పప్పు–గ్రేడ్ బి | రూ./క్వింటాల్ | 6,300 | 6,615 | 6,946 | 7,293 | 7,658 |
| 1.3 | విరిగిన పప్పు | రూ./క్వింటాల్ | 2,500 | 2,625 | 2,756 | 2,894 | 3,039 |
| 1.4 | పొట్టు | రూ./క్వింటాల్ | 900 | 945 | 992 | 1,042 | 1,094 |
| 1.5 | పొడి | రూ./క్వింటాల్ | 1,500 | 1,575 | 1,654 | 1,736 | 1,823 |
| **2. ఆదాయం** | | | | | | | |
| 2.1 | పప్పు–గ్రేడ్ ఎ | రూ.లక్షలలో | 318.50 | 406.09 | 451.47 | 505.65 | 530.93 |
| 2.2 | పప్పు–గ్రేడ్ బి | రూ.లక్షలలో | 483.84 | 449.82 | 500.09 | 560.11 | 588.11 |
| 2.3 | విరిగిన పప్పు | రూ.లక్షలలో | 72.00 | 66.94 | 74.42 | 83.35 | 87.52 |
| 2.4 | పొట్టు | రూ.లక్షలలో | 12.10 | 11.25 | 12.50 | 14.00 | 14.70 |
| 2.5 | పొడి | రూ.లక్షలలో | 8.64 | 8.03 | 8.93 | 10.00 | 10.50 |
| **మొత్తం ఆదాయం** | | **రూ.లక్షలలో** | **895.08** | **942.12** | **1,047.42** | **1,173.11** | **1,231.76** |

# అనుబంధం 3 : గోదాము సాధ్యాసాధ్యాలు

జైకిసాన్ ఫెడరేషన్ గోదాము సాధ్యాసాధ్యాలకు సంబంధించి అనేక అంశములు దిగువన ఇవ్వబడినవి. సేకరణ మరియు మార్కెటింగ్ కొరకు ఫెడరేషన్‌కు ఉత్పత్తుల పరిమాణం అంచనా (ఈ వస్తువులు వేరుసెనగ, కందులు, మిల్లెట్స్, మొక్కజొన్న మరియు శెనగలు కలుపుకొని) వేయడం జరిగినది.

3000 మంది క్రియాశీల సభ్యులు ; సభ్యునికి 5 క్వింటాల్ చొప్పున అమ్మిన 3000 × 5 =15,000 క్వింటాల్స్. ఇదేకాక 1000 మంది రైతులు తమ ఉత్పత్తిని నిల్వ చేసుకుంటారు. సగటున రైతుకు 5 క్వింటాల్ చొప్పున. 1,000 × 5 = 5,000 క్వింటాల్స్

ఉత్పత్తి అవసరములకు వచ్చినట్లయితే 3000 మంది క్రియాశీల సభ్యులకు 1 క్వింటాల్ విత్తనం మరియు 1.5 క్వింటాల్స్ ఇతర ఉత్పత్తి అవసరములు కావలసి వుంటుంది. సగటున ప్రతిసభ్యునికి రైతు ఉత్పత్తిదారుల సంస్థ నుండి 2.5 క్వింటాల్స్ ఉత్పత్తి అవసరములు తీసుకొనవచ్చును. 1 క్వింటాల్ గోదాములో కొంతకాలం నిల్వ చేయవలసి వుంటుంది

3,000 × 1 = 3,000 క్వింటాల్స్.

అలాగే 3000 క్వింటాల్స్ సంసాధన చేయబడిన వేరుసెనగ, కందులు మరియు శెనగల ఉత్పత్తులకు నిల్వ సదుపాయం కావలసి వుంటుంది. అలాగే ఇతర ఏజెన్సీల నుండి నిల్వ కొరకు డిమాండ్ ఉంటుంది. అది ఎక్కువ అయినప్పటికీ ఏ సమయములోనైనా 5000 క్వింటాల్ పరిగణించబడవలసి వుంటుంది. ఫెడరేషన్ వ్యాపారమునకు చాలినంత వస్తువుల లభ్యత వున్నది అని సూచిస్తుంది. దిగువ చూపిన విధముగా సంవత్సరములో ఎక్కువ భాగమునకు నిల్వ అవసరం విస్తరించి ఉండును.

**పట్టిక 12 : ఫెడరేషన్ గోదాములో నిల్వ అవసరం (టన్నులలో) నెలల వారీగా**

| కార్యక్రమము | పరిమాణం | జూన్ | జూలై | ఆగస్టు | సెప్టెంబర్ | అక్టోబర్ | నవంబర్ | డిసెంబర్ | జనవరి | ఫిబ్రవరి | మార్చి | ఏప్రిల్ | మే |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| రైతు ఉత్పత్తిదారుల సంస్థ మార్కెటింగ్ | 1500 | -- | -- | -- | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | - |
| ఎఫ్.పి.ఒ సంసాధన చేయబడిన ఉత్పత్తులు | 300 | 150 | 150 | 150 | -- | -- | -- | 150 | 150 | 150 | 150 | 150 | 150 |
| ఎఫ్.పి.ఒ ఉత్పత్తి అవసరములు | 300 | 300 | 300 | 200 | 100 | 200 | 100 | 150 | 100 | 50 | | 100 | 200 |
| వ్యక్తిగత సభ్యుల నిల్వ ఇతర ఏజెన్సీల నిల్వ | 500 | 50 | 50 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 |
| అవసరం అంచనా | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 | 500 |
| మొత్తం ప్రతి నెల నిల్వ అవసరం | | 1,000 | 1,000 | 1,350 | 1,600 | 1,700 | 1,600 | 1,800 | 1,750 | 1,700 | 1,650 | 1,500 | 1000 |

ప్రతి కార్యక్రమము యొక్క మొత్తం పరిమాణం, ప్రతి నెల వచ్చేవి వంతుల వారిగా దిగువ ఇవ్వబడినవి. ఈ పరిమాణములు చాల తక్కువ స్థాయిలో తీసుకొనడం జరిగినది. 5 రైతు ఉత్పత్తిదారుల సంస్థల లోని వ్యవసాయ కార్యక్రమములు మరియు పంటలు కలసి సంవత్సరలోని అనేక నెలలకు వ్యాపించి ఉంటాయి.

# అనుబంధం 4 : గోదాము వ్యయం

**మూలధన వ్యయం**

- భూమి – 0.5 ఎకరం
- భవనం – 10,000 చదరపు అడుగుల ప్రాంతం ; షెడ్ పై భాగం, వే బ్రిడ్జి, కార్యాలయ గది, ఆవరణ మొదలగునవి.
- ఫర్నిచర్ మరియు ఫిట్టింగ్స్– టేబుల్స్, కుర్చీలు, బీరువా మొదలగునవి..
- ప్లాంట్ మరియు మిషనరీ – తూచడానికి ఉపకరణములు, గ్రేడింగ్, ప్యాకింగ్, నాణ్యతా పరీక్షకు పరికరాలు
- ముందు నిర్వహణా ఖర్చులు – వివరణాత్మక యోజన నివేదిక (డిపిఆర్), ఆమోదం, లైసెన్సులు, శిక్షణ, అధ్యయన పర్యటన, గుర్తింపు మొదలగునవి.

**నిర్వహణ ఖర్చులు(గోదాము నడపటానికి అవసరమయ్యే వ్యయం) దిగువ విధముగా ఉంటాయి.**

- జీతములు (గోదాము మేనేజర్,సాంకేతిక సహాయకుడు, పనివారు, )
- వేతనములు (లేబర్)
- విద్యుచ్ఛక్తి
- గోదాము నిర్వహణ(గోదాము పెట్టుబడిలో1% శాతం)
- సరుకు నిర్వహణ ధూపం వేయుట – మాట్టింగ్ మొదలగునవి.
- వడ్డీ (టర్మ్ లోన్ పై)
- తరుగుదల

### పట్టిక 13 : గోదాము కార్యాచరణ వ్యయం (లక్షలలో)

| స. | వివరం | యూనిట్ | సం. 1 | సం. 2 | సం. 3 | సం. 4 | సం. 5 |
|---|---|---|---|---|---|---|---|
| 1. | గోదాము హెడ్ (రూ./నెలకు) | రూ.20000/నెలకు | 2.40 | 2.64 | 2.90 | 3.19 | 3.51 |
| 2. | సాంకేతిక సహాయకుడు (రూ./నెలకు) | రూ.15000/నెలకు | 1.80 | 1.98 | 2.18 | 2.40 | 2.64 |
| 3. | పనివారు (రూ./నెలకు) | రూ.12,000/నెలకు | 1.44 | 1.58 | 1.74 | 1.92 | 2.11 |
| 4. | ఎఫ్.పి.సి నిర్ణయించిన పనివారు | 3 లేబర్,15రో.పనివారు నెలకు రూ.200రోజుకు | 0.41 | 0.45 | 0.49 | 0.54 | 0.59 |
| 5. | తరుగుదల | 10% | 5.54 | 5.25 | 4.97 | 4.71 | 4.47 |
| 6. | వడ్డీ | 12% | 11.32 | 11.32 | 11.32 | 9.90 | 8.49 |
| 7. | గోదాము నిర్వహణ | 1% గోదాము పెట్టుబడిలో | 1.18 | 1.30 | 1.43 | 1.57 | 1.73 |
| 8. | విద్యుచ్ఛక్తి | రూ.10,000నెలకు | 0.60 | 0.66 | 0.73 | 0.80 | 0.88 |
| 9. | సరుకు నిర్వహణ (ధూపము, డన్నెజ్ మొదలగునవి) | రూ.10 / టన్ను / నెలకు | 3.53 | 3.71 | 3.89 | 4.09 | 4.29 |
| | మొత్తం | | 24.68 | 25.17 | 25.75 | 25.03 | 24.41 |

పైన పట్టికలో కార్యనిర్వహణ వ్యయం పూర్తి సంవత్సరం మరియు పూర్తి సామర్థ్యమునకు తీసుకోవడం జరిగినది. అయితే ఆదాయం గోదాము నడిపించిన కాలమునకు మరియు నడిచిన సామర్థ్యమునకు మాత్రమే తీసుకోవడం జరిగినది. ప్రణాళికలో అద్దె ఆదాయం మాత్రమే తీసుకోవడం జరిగినది. అంతేకాక సేకరణ కార్యక్రమము నుండి కుడా ఆదాయం ఉండును.

అంతేకాక సమతుల్య ఆదాయ వ్యయ స్థితి (గోదాము కనీస వ్యయం స్థాయిలో తన ఖర్చులను మరియు అక్కడనుండి లాభములు గడించును) 400 క్వింటాల్‌గా లెక్కకట్టబడినది. పైన వివరించిన విలువలను గమనించగా, ఈ పరిమాణమును ఏ సమయములోనైనా చేరుకోగలమని నమ్మకం.

# ముగింపు పరీక్ష

**ద**య చేసి గుర్తు చేసుకోండి మాడ్యుల్ ప్రారంభములో ప్రారంభ మదింపు వున్నది. దానిలో విలువ జోడింపుకు సంబంధించిన కొన్ని ప్రాథమిక ప్రశ్నలకు సమాధానం ఇచ్చాము.

ఇప్పుడు ఈ మాడ్యుల్ ముగింపుకు వచ్చాము. కనుక ముగింపు మదింపు ఇవ్వబడినది. ఈ మాడ్యుల్‌ను నేర్చుకొనడం ద్వారా గడించిన అదనపు అవగాహనను మనమే అంచనా వేసికోనుటకు ఇది ఉపయోగపడుతుంది.

**1. ఏఏ భిన్నమైన మార్గముల ద్వారా వ్యవసాయ వస్తువులకు ద్వితీయ (ఆధునిక) సంసాధన చేయవచ్చును?**

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

***2. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు సంసాధన మరియు విలువ జోడింపులలో ప్రవేశించవచ్చునా? అవును అయితే ఎందుకు?***

.......................................................................................................................

.......................................................................................................................

.......................................................................................................................

.............................................................................................................

.............................................................................................................

*3. వివిధ వ్యవసాయ వస్తువులలో రైతులు ఎక్కువ ప్రయోజనం పొందటానికి గల భిన్నమైన మార్గములు ఏమిటి ?*

.............................................................................................................

.............................................................................................................

.............................................................................................................

.............................................................................................................

## చర్య తీసుకోవలసిన కీలక అంశములు మాడ్యూల్
## 10ఎ "సమృద్ధి" రైతు ఉత్పత్తిదారుల సంస్థచే విలువ జోడింపు


**ఈ** సమృద్ధి పుస్తకము నుండి గమనించిన అంశముల నుండి మన ఎఫ్.పి.ఓలు ముఖ్యముగా చేపట్టవలసిన చర్యలు ఏమిటి?

# నోట్స్

# నోట్స్

# నోట్స్

# రైతు ఉత్పత్తిదారుల సంస్థ



ఏపిమాస్ లాభాపేక్ష లేని ఒక జాతీయ స్థాయి సంస్థగా స్వయం సహాయము, పరస్పర ప్రయోజనాలు, స్వయం బాధ్యత మరియు స్వావలంబననే మార్గదర్శన సూత్రాలుగా నమ్మే ప్రజా సంస్థలైన స్వయం సహాయక సంఘాలు, స్వయం సహాయక సంఘాల సమాఖ్యలు, సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు మరియు ఇతర ప్రజా సంస్థలను పటిష్టమైన సంస్థలుగా తీర్చిదిద్ది వాటి సాధికారత కృషి చేస్తున్న సంస్థ.

## సమృద్ధి : రైతు ఉత్పత్తిదారుల సంస్థలచే ఉత్పత్తులకు విలువ జోడింపు




ఏపిమాస్ ఏర్పాటు చేసిన ఎఫ్.పి.ఓ ఇంక్యుబేషన్ కేంద్రము రైతు ఉత్పత్తి దారుల సంస్థల సభ్యులు, ఎఫ్.పి.ఓలను ప్రోత్సహించే సంస్థల మరియు ఇతర సహాయ సంస్థల భాగస్వామ్యంతో ఎఫ్.పి.ఓలను సమర్థవంతమైన మరియు సుస్థిరమైన సంస్థలుగా తీర్చిదిద్దుటకు కావలసిన అన్ని రకాల సేవలు ఒకే చోట అందిస్తుంది. ఈ కేంద్రము ఎఫ్.పి.ఓలను బలోపేతం చేయుటకు కావలసిన భవిష్యత ప్రణాళికల తయారీ, చట్టబద్ధ మైన కార్య క్రమాలు సకాలములో చేపట్టుట, సంస్థాగత నిర్వహణ, పరిపాలన, వివిధ రకాల సామర్థ్య పెంపుదల కార్యక్రమాలు మొదలగు వాటిని చేపడుతుంది. అంతేగాక ఈ కేంద్రము ఎఫ్.పి.ఓలను వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దుటకు కావలసిన వ్యాపార ప్రణాళిక, ఆర్థికపరమైన అనుసంధానాలు, మార్కెట్ లింకేజీలు, సాంకేతిక సేవలు మొదలగు సేవలను అందిస్తుంది.

ఆర్థిక సహాకారం

DGRV

ప్రచురణ కర్తలు

apmas

# ప్రాధమిక ప్రాసెసింగ్‌లో కార్యక్రమాలు



## శుభ్రపరచడం

రాళ్ళు/మట్టిరాళ్ళు, ఇతర మొక్కల గింజలు
మొదలైన అన్య పదార్థాలు లేకుండా
ఉత్పత్తులను శుభ్రపరచటం.

## ఎండబెట్టడం

ఉండవలసిన పరిమితిలో మాత్రమే
తేమను కలిగి ఉండటం.






## గ్రేడింగు ప్రకారం వేరుచేయడం

ఉత్పత్తుల నాణ్యతనుబట్టి గ్రేడులుగా
వేరుచేయటం

## ప్యాకింగ్

ఉత్పత్తులను బట్టి సంచులలో భద్రపరచటం



apmas

DGRV